ప్రజాశక్తి

మంగళవారం 10 డిసెంబర్ 2024 8 పేజీలు



గుంటూరు



పల్నాడు

ఇళ్లకు బృందాలు

- సామాజిక పింఛన్ల తనిఖీ ప్రారంభం
- కంభంపాడు, వేజెండ్లలో తొలిరోజు పరిశీలన



పల్నాడు జిల్లా మాచర్ల మండలం కంభంపాడు, గుంటూరు, జిల్లా చేబ్రోలు మండలం వేజెండ్లలో లబ్ధిదార్ల వివరాల సేకరణలో బృందాలు



ప్రజాశక్తి- మాచర్ల రూరల్/చేబ్రోలు

సామాజిక పింఛన్ల తనిఖీల్లో భాగంగా గుంటూరు జిల్లా వేజెండ్ల, పల్నాడు జిల్లా కంభంపాడు గ్రామాల్లో సోమవారం అధికారులు ఇంటింటికి వెళ్లి లబ్ధిదారుల నుంచి వివరాలు సేకరించారు. పైలట్ ప్రాజెక్టుగా రెండు గ్రామాల్లో పరిశీలన చేపట్టారు. అనర్హుల ఎరివేత పేరుతో వివిధ అంశాలపై సమాచారం నమోదు చేశారు. పల్నాడు జిల్లా మాచర్ల మండలం కంభంపాడు సచివాలయం-2 పరిధిలోని వికలాంగులు, వృద్ధులు, వితంతువుల పింఛన్లను పరిశీలన చేశారు. ఈ సచివాలయం పరిధిలో 505 మంది లబ్ధిదార్లున్నారు. ఎంపిడిఒ ఫణికుమార్ నాయక్ సూపర్‌వైజర్‌గా డిఎల్‌డిఒ గర్భూనాయక్ ఆధ్వర్యంలో సచివాలయం పరిధిని 20 క్లస్టర్లుగా విభజించి ఒక్కో క్లస్టర్ కింద ఇద్దరు అధికారులకు 40 పింఛన్ల తనిఖీ బాధ్యతలు అప్పగించారు. వివిధ మండలాల నుంచి వచ్చిన అధికారులు గ్రామంలో తనిఖీలు చేపట్టారు. వారి ఫోన్ యాప్‌లో ఉన్న ప్రశ్నావళి ప్రకారం లబ్ధిదారులు నుంచి వివరాలు సేకరించి, ఆధార్ కార్డు, వికలాంగుల సర్టిఫికెట్ తదితర పత్రాలను పరిశీలించి యాప్‌లో అప్‌లోడ్ చేశారు. ఎంపిడిఒ ఫణికుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు మంగళవారం తనిఖీ జరుగుతుందన్నారు. తొలిరోజు సచివాలయం పరిధిలో 87 శాతం పింఛన్ల తనిఖీలు పూర్తి చేశామన్నారు. మరికొందరు అందుబాటులేరని వారి వివరాలు మంగళవారం సేకరిస్తామని తెలిపారు. పింఛన్లు తనిఖీ చేసినవారిలో అధికారులు పద్మజ, వెంకటేశ్వర్లు, వెంకటేష్, సురేష్ తదితరులున్నారు.

గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం వేజెండ్లలో 600 పింఛన్లను పరిశీలించారు. బృందానికి ఇద్దరు చొప్పున అధికారులు 16 బృందాలుగా 32 మంది పరిశీలనలో పాల్గొన్నారు. లబ్ధిదార్ల కుటుంబీకుల్లో ఎవరికైనా నెలకు ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో అయితే రూ.10 వేలు, పట్టణ ప్రాంతాల్లో అయితే రూ.12 వేలలోపు ఉందా? లేదా? మాగాణి మూడెకరాలకు మించి, మెట్టయితే పదెకరాలకు మించి, మెట్ట, మాగాణి కలిపి పదెకరాలకు మించి ఉన్నా, నాలుగు చక్రాల వాహనం ఉన్నా (టాక్సీ, ట్రాక్టర్ , ఆటో కాకుండా), కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగి

▶ 2లో



మానవ నిర్మిత మహాకట్టడం.. నాగార్జునసాగర్‌కి పునాదిరాయిపడి నేటికి 69 ఏళ్లు!

ప్రజాశక్తి - విజయపురిసౌత్

మానవ నిర్మిత ఆధునిక దేవాలయంగా భావించే నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ శంకుస్థాపన చేసి మంగళవారానికి 69 ఏళ్లయింది. 1955 డిసెంబర్ 10న అప్పటి భారత ప్రధాని జవహర్లాల్ నెహ్రూ శంకుస్థాపన చేయగా ప్రాజెక్టు పనులు 1960లో ప్రారంభించారు. ఈ ప్రాజెక్టుకు నిర్మాణం ఖర్చు రూ.1300 కోట్లు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని గుంటూరు జిల్లా, నల్గొండ జిల్లా మధ్య ఉన్న కృష్ణా నదిపై నిర్మించబడ్డ ఆనకట్టల్లో నాగార్జునసాగర్ ప్రాజెక్టు పెద్దది. దేశంలో జలాశయ సామర్థ్యంలో రెండవ స్థానం, ఆనకట్ట పొడవులో మొదటి స్థానంలో ఉంది. కృష్ణా నదిపై నిర్మితమైన ఆనకట్టల్లో నాగార్జునసాగర్ అతిపెద్ద బహుళార్ధ సాధక ప్రాజెక్టు, డ్యామ్‌కు ఇరువైపులా రెండు ప్రధాన విద్యుత్ తయారీ కేంద్రాలున్నాయి. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 48 టీఎంసీలు. కనీస స్థాయి నిల్వ 213 టీఎంసీలు, విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం 960 మెగావాట్లు. ఈ ప్రాంతానికి ఉన్న చరిత్ర ప్రాధాన్యం వల్ల ప్రాజెక్టుకు నాగార్జునసాగర్ ప్రాజెక్టు అని పేరు పెట్టారు. నాగార్జున సాగర్ ప్రముఖ బౌద్ధ చారిత్రక స్థలం.

▶ 2లో



మహిళపై లైంగిక దాడికి యత్నం

పోలీసుల అదుపులో నిందితుడు

ప్రజాశక్తి-తాడేపల్లి

పట్టణంలోని పారీ కంపెనీకి సమీపంలో నివాసం ఉంటున్న మహిళపై ఆదివారం రాత్రితో లైంగిక దాడికి తెగబడిన దుండగుడి నుండి మహిళ తప్పించుకుని పోలీసులను ఆశ్రయించగా నిందితుణ్ణి పోలీసులు 12 గంటల్లోనే అదుపులోకి తీసుకున్నారు. దీనిపై మీడియాకు వివరాలను తాడేపల్లి సిఐ బత్తుల కళ్యాణ్ రాజు సోమవారం వెల్లడించారు. మహిళకు చెందిన కుమారునితో స్నేహాన్ని అడ్డు పెట్టుకుని ఆమె ఇంటికి ఆదివారం రాత్రి వచ్చిన దుండగుడు ఇంట్లో ఎవరూ లేకపోవడాన్ని గమనించి ఆమెపై లైంగిక దాడికి యత్నించాడు. భయపడిన ఆమె కేకలు వేసుకుంటూ సమీపంలోని ముళ్ల పొదల్లోకి వెళ్లి దాక్కుంది. అరుపులు విన్న స్థానికులు అక్కడికొచ్చి ఆమెకు రక్షణ కల్పించగా నిందితుడు పరారయ్యాడు. బాధితురాలు తాడేపల్లి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చయగా సిఐ వెంటనే స్పందించారు. సోమవారం ఉదయం 10 గంటలకు నిందితుడు తెంపరల రామారావును అదుపులోకి తీసుకున్నారు. బాధితురాలిని వైద్య పరీక్షల కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దుండగుణ్ణి కఠినంగా శిక్షించాలని అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.శ్రీనివాస్‌కుమారి, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు డి.విజయలక్ష్మి, ఎస్.గిరిజ డిమాండ్ చేశారు. ఇటువంటి ఘటనలు జరగటానికి తాడేపల్లిలో విచ్చలవిడిగా బెల్ట్ షాపులతో పాటు మద్యం ఏరులై పారుతుండడమేనని ఆందోళన వ్యక్తం చేశారు. మద్యం అమ్మకాలను నియంత్రించడంతోపాటు రాత్రి వేళ పోలీసు గస్తీ పెంచాలని కోరారు.

గల్లా జయదేవ్‌కు మొండిచేయి!

ప్రయత్నాలు చేసినా, ప్రచారాలైనా జిల్లా వాసులకు దక్కని అవకాశం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

రాజ్యసభ స్థానంపై ఆశలు పెట్టుకున్న జిల్లాకు చెందిన ఇద్దరు ప్రముఖులకు నిరాశ ఎదురైంది. గత ఎన్నికలకు ముందు రాజకీయాల నుంచి విరామం తీసుకుంటున్నట్టు ప్రకటించిన గుంటూరు మాజీ ఎంపి గల్లా జయదేవ్ తన నిర్ణయాన్ని మార్చుకుని మళ్లీ టిడిపిలో పని చేసేందుకు సుముఖత చూపారు. అంతేగాక రాష్ట్రంలో ఖాళీ అయిన మూడు రాజ్యసభ స్థానాల్లో ఒకటి తనకు కేటాయించాలని పార్టీ అధినేత చంద్రబాబును కోరారు. ఇందుకు ఆయన సూచనప్రాయంగా అంగీకరించారని వార్తలొచ్చాయి. అయితే కూటమి పార్టీల మధ్య ఏర్పడిన పోటీ వల్ల గల్లా జయదేవ్‌కు అవకాశం దక్కలేదు. రాజ్యసభ మాజీ సభ్యుడు ఆర్.కృష్ణయ్యను బిజెపి అభ్యర్థిగా రాజ్యసభకు ఎంపిక చేశారు. నెల్లూరుకు చెందిన బీద మస్తాన్‌రావుకు మరోసారి అవకాశం ఇస్తామని ముందే హామీ ఇవ్వడంతో పాటు మంత్రి నారా లోకేష్‌కు అనుచరుడైన సానా సతీష్‌కు అవకాశం ఇవ్వడంలో టిడిపిలో ఇతర సీనియర్లకు ఎవ్వరికీ అవకాశం దక్కలేదు. గల్లా జయదేవ్‌కు అవకాశం ఇస్తారని టిడిపిలో గతనెల రోజులుగా చర్చ జరిగింది. చంద్రబాబు నాయుడితో జయదేవ్‌కు ఉన్న సాన్నిహిత్యం వల్ల తప్పని సరిగా అవకాశం వస్తుందని భావించినా ఇతరుల నుంచి వత్తిడి పెరగడంతో జయదేవ్‌కు అవకాశం రాలేదని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. 2026లో నాలుగు ఖాళీలు వచ్చే అవకాశం ఉందని, అప్పటి వరకు వేచి ఉండాల్సిందేనని పలువురు ఆశావాహులకు పార్టీ అధిష్టానం సమాధాన పరుస్తోంది. భాష్యం విద్యా సంస్థల అధినేత భాష్యం రామకృష్ణ పేరు కూడా తెరపైకి వచ్చింది. గత ఎన్నికల్లోనే ఆయనకు గుంటూరు లేదా నరసరావుపేట, ఏలూరు నుంచి పోటీ చేస్తారని ప్రచారమైనా అప్పట్లో అవకాశం రాలేదు. దీంతో రాజ్యసభ ఇస్తారని కొంత కాలంగా ప్రచారమైంది. అయితే మారిన రాజకీయ, సామాజిక పరిస్థితుల్లో సానా సతీష్‌కు అవకాశం ఇవ్వడం వల్ల జయదేవ్, రామకృష్ణకు అవకాశం రాలేదంటున్నారు.

30న పట్టభద్ర ఓటర్ల తుదిజాబితా

- అభ్యంతరాలకు ముగిసిన గడువు
- 63,607 దరఖాస్తులు స్వీకరణ

ప్రజాశక్తి-గుంటూరు

ఉమ్మడి కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గానికి వచ్చే ఏడాది మార్చిలో జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ల ముసాయిదా జాబితాపై సోమవారంతో అభ్యంతరాలకు గడువు ముగిసింది. రాత్రి 10 గంటల వరకూ అందిన సమాచారం ప్రకారం గ్రాడ్యుయేట్ నియోజకవర్గ పరిధిలోని ఆరు జిల్లాల నుండి 63,607 దరఖాస్తులు అందాయని అధికారులు తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా 56,631, ఆఫ్‌లైన్ ద్వారా 6976 దరఖాస్తులు అందాయి. వీటిల్లో అభ్యంతరాలకు సంబంధించి ఫారం-7, సవరణల కోసం ఫారం-8తోపాటు, కొత్తగా ఓటు నమోదుకు ఫారం-18 దరఖాస్తులున్నాయి. బాపట్ల జిల్లా నుండి 4619, ఏలూరు 1743, గుంటూరు 23,636, కృష్ణా 8047, ఎన్‌టిఆర్ జిల్లా 15,575, పల్నాడు జిల్లా నుండి 9987 దరఖాస్తులు అందాయి. దరఖాస్తుల స్వీకరణకు అర్ధరాత్రి 12 గంటల వరకూ గడువు ఇచ్చారు. నవంబర్ 6వ తేదీ వరకూ అందిన దరఖాస్తులలో 2,90,878 ఆమోదించి, నవంబర్ 23న ముసాయిదా జాబితా విడుదల చేసిన విషయం విదితమే. సదరు జాబితాపై అభ్యంతరాలు, సవరణలతోపాటు, కొత్తగా ఓటు నమోదుకు గడువు ముగిసింది. డ్రాఫ్ట్ ఓటరు జాబితాపై వచ్చిన అభ్యంతరాలు, కొత్త ఓటరు దరఖాస్తులను ఈనెల 25వ తేదీలోగా పరిష్కరించి, 30 నాటికి తుది జాబితా ప్రకటించనున్నారు.



గాదె సుబ్బారెడ్డికి నివాళి

ప్రజాశక్తి - ఫిరంగిపురం

ప్రజానాట్య మండలి రాష్ట్ర ఉపాధ్యక్షులు గాదె సుబ్బారెడ్డి ఇటీవల మరణించిన నేపథ్యంలో మండలంలోని పొనుగుపాడలో సిపిఎం నాయకులు సోమవారం నివాళులర్పించారు. చిత్రపటానికి సిపిఎం మండల కన్వీనర్ షేక్ మస్తాన్‌వలి తదితరులు పూలమాలవేసి నివాళులర్పించారు.



టిడిపిలో చేరిన వారితో ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్

వైసిపిని వీడి టిడిపిలోకి 30 మంది

ప్రజాశక్తి - తుళ్లూరు

మండలంలోని పెదపరిమికి చెందిన 30 మంది వైసిపి కార్యకర్తలు టిడిపిలో చేరారు. గుంటూరులోని టిడిపి తాడికొండ నియోజకవర్గ కార్యాలయంలో సోమవారం ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్ సమక్షంలో టిడిపిలో చేరారు. ఎమ్మెల్యే వారికి టిడిపి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో పెదపరిమి టిడిపి నాయకులు పుట్టి రామచంద్రరావు, నూతలపాటి రామారావు, ఆర్దల సాంబశివరావు, పోతుగుంట్ల నర్సయ్య పాల్గొన్నారు.

ఇళ్లకు బృందాలు

(మొదటి పేజీ తరువాయి)

లేదా ప్రభుత్వ పెన్షన్ వున్నా , ఎక్కువ విద్యుత్ వినియోగం ఉన్నా (12 నెలలు సగటున 300 యూనిట్లు పైన), పట్టణంలో ఆస్తులున్నా (మున్సిపాలిటీల్లో 1000 చదరపు అడుగులు నిర్మాణం), ఆదాయపు పన్ను చెల్లిచడం లాంటి ప్రభుత్వం నిర్దేశించిన అంశాలను లబ్ధిదార్ల నుండి అడిగి తెలుసుకొని అవునా? కాదా? అనే వివరాలను వెరిఫికేషనులో పరిశీలించి ఆ వివరాలను యాప్‌లో నమోదు చేశారు. వికలాంగులకు సంబంధించి ధ్రువపత్రాలు పరిశీలించి అవసరమైతే మరోసారి ధ్రువపత్రాలు పొందాల్సి ఉంటుందని అధికారులు సూచనప్రాయంగా తెలిపారు. వితంతువుల్లో మళ్లీ వివాహం చేసుకున్నారా? లేదా? అని పరిశీలించారు. చేనేత కార్మికులు, డప్పుకళాకారులు స్థానికంగా వృత్తుల్లో ఉన్నారా? లేదా? అని పరిశీలించారు. అనంతరం లబ్ధిదారుని స్వచ్ఛంద అనుమతితో వెరిఫికేషన్ పూర్తి చేసినట్టు వారి నుంచి అంగీకారం తీసుకున్నారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ అధికారి విజయలక్ష్మి, డిఎల్‌డిఒ శ్రీదేవి, ఎంపిడిఒ కె లలిత, ఎపిఒ లక్ష్మీ పాల్గొన్నారు.

మానవ నిర్మిత మహాకట్టడం.. నాగార్జునసాగర్‌కి పునాదిరాయిపడి నేటికి 69 ఏళ్లు!

(మొదటి పేజీ తరువాయి)

శాత వాహన కాలం నాటి శ్రీ పర్వతమే నాగార్జున కొండ, ఆచార్య నాగార్జునుడు ఈ ప్రాంతంలో బోధనలు చేసినట్టుగా చారిత్రక ఆధారాలున్నాయి. జలాశయ నిర్మాణంలో సమయంలో ఇక్కడ లభించిన అమూల్యమైన చారిత్రక కట్టడాల శిథిలాలను జలాశయం మధ్యలో నాగార్జున కొండ ప్రదర్శనశాలలో భద్రపరిచారు. ఇది అప్పటి గుంటూరు జిల్లా ఇప్పుడు పల్నాడు జిల్లాలో విజయపురి సౌత్‌లోని నాగార్జున కొండగా పిలుస్తున్నారు. విజయపురిసౌత్‌లో విమాన శిక్షణ కోసం నాగార్జునసాగర్‌లో చిన్నపాటి విమానాశ్రయం కూడా ఉంది.

వ్యాపార ఆలోచన.. బహుభాషా ప్రదర్శన..

ప్రజాశక్తి - తుళ్లూరు

రాజధాని ప్రాంతం తుళ్లూరులో ఒక కళ్ళ జోళ్ళ షాపు నిర్వాహకులు ఏర్పాటు చేసిన బోర్డు చాలా మంది దృష్టినాకర్షిస్తోంది. సాధారణంగా వ్యాపార దుకాణాల ముందు తెలుగు, ఇంగ్లీషులో రాసిన బోర్డులను ఉంచుతారు. దినేష్ మెడికల్ షాప్ అనో, రసూల్ బాయ్ చికెన్ స్టాల్..ఇలా తెలుగు, ఇంగ్లీష్‌లో రాసిన బోర్డులు దుకాణాల ముందు చూస్తుంటాం. కానీ తుళ్లూరులో సన్‌రైజ్ ఆప్టికల్స్ అనే కళ్లజోళ్ళ షాపు నిర్వాహకులు తెలుగు, ఇంగ్లీష్, హిందీతో పాటు పలు భాషలతో రాయించిన బోర్డును తన షాపు వద్ద ఏర్పాటు చేశారు. రాజధాని నిర్మాణానికి ఇప్పటికే ఇతర రాష్ట్రాలకు చెందిన కార్మికులు కొందరు తుళ్లూరు, పరిసర గ్రామాల్లో ఉంటున్నారు. కొద్దిరోజుల్లో రాజధాని నిర్మాణ పనులు పూర్తి స్థాయిలో ప్రారంభం కానున్నాయి. పనులు మొదలయితే రాష్ట్రంలోని అనేక ప్రాంతాల నుంచే కాక తెలంగాణ, బీహార్, ఒడిస్సా, పశ్చిమ బంగా, తమిళనాడు తదితర రాష్ట్రాల నుంచి కార్మికులు పెద్దసంఖ్యలో వస్తారు. ఇది ఊహించిన షాపు నిర్వాహకులు పలు భాషలతో రాయించిన బోర్డును ఉంచారు. వేరే రాష్ట్రాలకు చెందినవారు ఎలాంటి ఇబ్బందీ పడకూడదని భావించి బోర్డును రాయించామని నిర్వాహకులు చెప్పారు.



తుళ్లూరులో వివిధ భాషలతో ఏర్పాటైన బోర్డు..

సైబర్ నేరాలపై షార్ట్‌ఫిల్మ్ పోటీలు : ఎస్పీ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

జిల్లా ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కొరకు సైబర్ నేరాల అవగాహన వారోత్సవాలను నిర్వహిస్తున్నట్టు జిల్లా ఎస్పి సతీష్‌కుమార్ తెలిపారు. ఇందులో భాగంగా లఘు చిత్రాల పోటీలు నిర్వహిస్తున్నట్టు ఆయన తెలిపారు. ఈ మేరకు సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో అధికారులతో కలసి పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఆన్‌లైన్ పెమెంట్ విధానం ద్వారా ఆర్థిక లావాదేవీలు పెరుగుతున్న నేపథ్యంలో సైబర్ నేరాలు కూడా పెరిగి, నిత్యకృత్యమై ఎంతోమంది అమాయకుల ధన, మాన, ప్రాణాలను హరిస్తున్నాయన్నారు. సైబర్ నేరగాళ్ల వలలో పడి ఎంతోమంది అమాయకులు తమ ఆస్తులనే కాక జీవితాలను కూడా కోల్పోతున్నారని తెలిపారు. ఎంతోమంది బాధితులు బయటకు చెప్పుకోలేక తమలో తాము కుమిలిపోతూ మానసిక క్షోభను అనుభవిస్తున్నారన్నారు. కొంతమంది ఆత్మహత్యలు కూడా చేసుకుంటున్నారని తెలిపారు. వీటిపై అవగాహన పెంచుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సబ్ డివిజన్ స్థాయిలో లఘుచిత్రాల ప్రదర్శన నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈనెల 9వ తేదీ నుండి 23వ తేదీ ప్రదర్శలను నిర్వహిస్తామన్నారు. విద్యా సంస్థలు, కూడలి ప్రదేశాల్లో నిర్వహించ నున్నట్టు తెలిపారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు తాము రూపొందించిన సైబర్ నేరాల అవగాహన షార్ట్ వీడియోలను సంబంధిత పోలీస్ సబ్ డివిజన్ వారికి మెయిల్ ద్వారా గాని, ఫోన్ నంబర్ ద్వారా గాని పంపించవచ్చని తెలిపారు. ప్రతి పోలీస్ సబ్ డివిజన్‌కు వచ్చిన మొత్తం వీడియోలలో నుండి మూడు (3) వీడియోలను పోలీస్ ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారి ఆధ్వర్యంలోని బందం ఎంపిక చేస్తుందని, ఆ విధంగా ఆరు (6) సబ్ డివిజన్లో మూడు(3) వీడియోలు చొప్పున ఎంపిక చేసిన మొత్తం 18 వీడియోలలో ఆఖరుకు మరల మూడు (3) వీడియోలు ఎంపిక చేసి వారికి ప్రథమ బహుమతి రూ.25 వేలు, ద్వితీయ బహుమతి రూ.20 వేలు, తృతీయ బహుమతి రూ.15 వేలు బహుమతులను అందజేస్తా మన్నారు. కార్యక్రమంలో ట్రైనీ ఐపిఎస్ దీక్ష, అదనపు ఎస్‌పిలు రమణమూర్తి, హనుమంతు, కె.సుప్రజ, డిఎస్‌పి సీతారామయ్య, సిఐలు శ్రీనివాసరావు, రాంబాబు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎస్.పి. సతీష్ కుమార్, ఇతర పోలిస్ అధికారులు

కేరళ సంఘీభావ సభను జయప్రదం చేయండి : సిఐటియు

ప్రజాశక్తి - మైలవరం

ఈ నెల 11న విజయవాడలో జరిగే కేరళ సంఘీభావ సభను జయప్రదం చేయాలని సిఐటియు మండల కార్యదర్శి సిహెచ్.సుధాకర్ పిలుపునిచ్చారు. కేరళ సంఘీభావ సభను జయప్రదం చేయాలని కోరుతూ స్థానిక నూజివీడు రోడ్‌లోని గాంధీ గ్రంథాలయంలో సోమవారం ముఠా కార్మికులతో కలిసి కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేరళ రాష్ట్రం అక్షరాస్యతలో దేశంలోనే అగ్రస్థానంలో ఉందన్నారు. కార్మికుల కనీస నెల వేతనం రూ.26 వేలు పైగా ఉందని వలస కార్మికులను అతిథి కార్మికులగా గుర్తించి అన్ని వసతులు సమకూర్చారన్నారు. 30 రకాల వెల్ఫేర్ బోర్డులు ఏర్పాటు చేసి ప్రజలకు సేవలు అందిస్తుందని, ప్రత్యామ్నాయ విధానాలు అమలపరుస్తున్న కేరళ ప్రభుత్వంపై కేంద్ర ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ఈ వైఖరిని దేశ ప్రజలందరూ ఖండించాలని ఈనెల 11న విజయవాడ బందర్ రోడ్‌లోని మాకినేని బసవ పుణ్య విజ్ఞాన కేంద్రంలో జరిగే సభకు ఎఐకెఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి విజ్జు కృష్ణన్న, మాజీ మంత్రివర్యులు వడ్డే శోభనాద్రి ఈశ్వరరావు పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో ముఠావర్కర్స్ యూనియన్ మండల కార్యదర్శి బి.మారేశ్వరరావు, ముఠావర్కర్ యూనియన్ నాయకులు ఉపతల నారాయణ, వెంకటేశ్వరరావు, తంబి రామారావు, చెన్నారావు, కుప్పాల దినేష్ తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సుధాకర్, తదితరులు

గోపిమూర్తి గెలుపు పట్ల యుటిఎఫ్ హర్షం



ప్రజాశక్తి-విజయవాడ : తూర్పు, పశ్చిమ గోదావరి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో యుటిఎఫ్, ఇతర ఉపాధ్యాయ సంఘాలు బలపరిచిన పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి బొర్రా గోపిమూర్తి నాలుగు వేలకు పైగా మెజార్టీతో గెలుపొందడం చారిత్రక విజయమని యుటిఎఫ్ ఎన్టీఆర్ జిల్లా నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం విజయవాడలోని యుటిఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. రాష్ట్ర నాయకులు కేక్ కట్ చేసి హర్షం వ్యక్తం చేశారు. విద్యారంగ పరిరక్షణకు, ఉపాధ్యాయుల సంక్షేమానికి గోపిమూర్తి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్పి మనోహర్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు కె.శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి ఎ.సుందరయ్య, నాయకులు పి.నాగేశ్వరరావు, ఎ.గోపాలకృష్ణ, డి.హరి ప్రసాద్, ఎ.అనంతకుమార్, కె.సంజీవ రెడ్డి, ఎం.జోగిరాజు, కె.మల్లికార్జున్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదులు విధుల బహిష్కరణ

ప్రజాశక్తి - తిరువూరు : న్యాయవాదుల సర్టిఫికెట్ ఆఫ్ ప్రాక్టీస్ రెన్యూవల్ చేసేందుకు 5 వకాలత్‌లను తప్పనిసరిగా సమర్పించాలనే నిబంధనను నిరసిస్తూ న్యాయవాదులు విధులు బహిష్కరించారు. తిరువూరులోని జూనియ ర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయవాదులు బార్ అసోసి యేషన్ ఆధ్వర్యంలో విధులు బహిష్కరించారు. బార్ సియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి వాకధాని. లక్ష్మీనారాయణ, షేక్.గౌసుద్దీన్, మాకరాజు రామ్మోహన్ రాజు, మునగాల అప్పారావు, మేకల నాగేంద్రప్రసాద్, రాజవరపు. శ్రీని వాసరావు,నాగు బండి రమేష్ బాబు, దారా మాధవరావు, గోగి రెడ్డి కష్ణారెడ్డి, గడ్డం శ్రీనివాస్ రెడ్డి, అంకిరెడ్డి.అంజన్ రెడ్డి పాల్గొన్నారు. జగ్గయ్యపేట : జగ్గయ్యపేట బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ అన్నెపాగ సుందరరావు ఆధ్వర్యంలో సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ న్యాయవాదుల మనోభావాలతో చెలగాటమాడితే తగిన మూల్యం చెల్లించవలసి వస్తుందని హెచ్చరించారు.

పారిశుధ్య కార్మికుల వేతనాల కోసం వినతి

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా) : ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న శానిటేషన్ వర్కర్స్‌కు పెండింగ్‌లో ఉన్న ఆరు నెలల వేతనాలు వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కలెక్టర్ డికె బాలాజీ ని కలసి వినతి పత్రం అందజేశారు. అనంతరం సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఓడుగు గంగాధర్ రావు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో దశాబ్ద కాలం నుండి పేదలు అతి తక్కువ వేతనాలతో పనిచేస్తున్నారని, అసలే ఇచ్చే అర కోర వేతనాలు కూడా సక్రమంగా చెల్లించకపోవడంతో కార్మికులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటు న్నరన్నారు. వీరికి దాదాపుగా ఆరు నెలలు నుండి వేతన బకాయలు పెండింగ్ లో ఉన్నాయన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 78 ఫిర్యాదులు

ఫిర్యాదులను స్వీకరించిన పల్నాడు జిల్లా ఎస్‌పి కంచి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పల్నాడు జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు పాల్గొని, ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరించారు. కార్యక్రమంలో ఆయా సమస్యలకు సంబంధించి 78 ఫిర్యాదులు అందాయన్నారు.

ఉద్యోగం పేరిట మోసంపై మహిళ ఫిర్యాదు

నరసరావుపేట మండలం ఉప్పలపాడు గ్రామానికి చెందిన మొగిలి కోటేశ్వరరావు ద్వారా అదే గ్రామానికి చెందిన కుంబా వెంకట కోటయ్య ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి రూ 4.50 లక్షలు తీసుకొని ఉద్యోగం ఇప్పించ కుండా తిరిగి డబ్బులు వెనక్కి ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారని దీనిపై విచారణ జరిపి న్యాయం చేయాలని మేడికొండూరు మండలం సిరిపురం గ్రామానికి చెందిన మేడా భాగ్యలక్ష్మి ఫిర్యాదు చేశారు.



అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్.పి కె.శ్రీనివాసరావు

వివిఎస్ఆర్ కళాశాలను సందర్శించిన నాక్ టీమ్

ప్రజాశక్తి-తెనాలిరూరల్

డిసెంబర్ 6, 7న స్థానిక వియస్ఆర్ అండ్ ఎన్విఆర్ కళాశాలను నాక్ టీమ్ సందర్శించినట్లు కళాశాల కరస్పాండెంట్ నన్నపనేని సుధాకర్ తెలిపారు. సోమవారం కళాశాలలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సుధాకర్ మాట్లాడుతూ త్రిసభ్య నాక్ టీం సభ్యులు పర్యటనలో కళాశాలలోని అన్ని విభాగాలతో పాటు రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారన్నారు. ప్రతి ఐదేళ్లకు ఒకసారి కళాశాలను పరిశీలించే నాక్ టీం నాలుగు పర్యాయాలు కళాశాలను సందర్శించారన్నారు. నాక్ పర్యటన ద్వారా కళాశాలకు మెరుగైన గ్రేడింగ్ వస్తుందనే ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన అధ్యాపక, అధ్యాపకేతర బృందాన్ని ప్రత్యేకంగా అభినందించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్ రవీంద్రనాథ్ మాట్లాడుతూ కళాశాల వ్యవస్థాపకులు నన్నపనేని సుధాకర్ ఆశయాలకు అనుగుణంగా పేద, బడుగు, బలహీన వర్గాలకు మెరుగైన విద్యా బోధన అందిస్తున్నామన్నారు. ఎన్‌సిసి, ఎన్ఎస్ఎస్, జిమ్, ల్యాబ్స్, విశాల ప్రాంగణం, ఆడిటోరియం తదితర సౌకర్యాలు కళాశాలలో విద్యార్థులకు అందుబాటులో ఉన్నాయన్నారు. వీటన్నింటినీ పరిశీలించి నాక్ టీం సంతృప్తి వ్యక్తం చేసిందని అన్నారు. విద్యతో పాటు విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందించేలా సాంస్కృతిక కార్యక్రమాలకు పెద్దఎత్తులో నిర్వహిస్తున్నామని అన్నారు. విశ్రాంత ప్రిన్సిపాల్, నాక్ అడ్వైజర్ సుగుణ మాట్లాడుతూ కళాశాల పూర్వ విద్యార్థిగా, అధ్యాపకురాలిగా, ప్రిన్సిపాల్‌గా పనిచేసిన తాను ఈ కార్యక్రమం ద్వారా కళాశాల రుణం తీర్చుకున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎన్విఆర్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీ నారాయణ, వైస్ ప్రిన్సిపాల్ అజయ్, ఐక్యూఏసి కో ఆర్డినేటర్ కామాక్షి, నాగమణి అధ్యాపకులు పాల్గొన్నారు.



నాక్ టీమ్ సభ్యులతో కళాశాల కరస్పాండెంట్ సుధాకర్ తదితరులు

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - దుగ్గిరాల

సైబర్ నేరాలు పట్ల అప్రమత్తంగా ఉండాలని మంగళగిరి రూరల్ సీఐ శ్రీనివాసరావు విద్యార్థిని విద్యార్థులకు తెలిపారు. సైబర్ నేరాలు పట్ల అవగాహన వారోత్సవాలలో భాగంగా సోమవారం మండలంలోని చింతలపూడి గ్రామంలోని ప్రియదర్శిని ఇంజినీ రింగ్ కాలేజీ లో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. . ఈ సందర్భంగా ఆయన సైబర్ నేరాలు జరుగుతున్న తీరును వివరించారు. విద్యార్థులు అప్రమత్తంగా ఉండటమే కాకుండా కుటుంబ సభ్యులకు కూడా అవగాహన కల్పించాలని కోరారు. అభ్యంతర కర మెసేజ్‌లు ఫోన్‌కాల్స్ వచ్చిన ఎడల వెంటనే పోలీసులకు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో దు గ్గిరాల ఎస్సై ఎస్ వెంకట రవి సిబ్బంది శ్రీనివాసరావు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



సైబర్ నేరాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సిఐ

బస్సునుండి జారిపడిన వ్యక్తి పరిస్థితి విషమం

ప్రజాశక్తి- మాచర్ల



ఓ గుర్తు తెలియని వ్యక్తి బస్సు ఎక్కబోయి ప్రమాదవశాత్తు కాలుజారి కిందపడి అపస్మారక స్థితిలోకి వెళ్ళిన సంఘటన మాచర్ల పట్టణంలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. ఓ వ్యక్తి ఆదివారం రాత్రి 10 గంట సమయంలో స్థానిక బస్‌స్టాండ్‌లో బస్సు ఎక్కబోయి జారీ పడి గాయపడ్డాడు. సమాచారం అందుకున్న పట్టణ పోలీసులు ఆ వ్యక్తిని మాచర్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించి, పేరు కూడా చెప్పకుండా అపస్మారక స్థితికి వెళ్లాడు. మెరుగైన చికిత్స కోసం అతన్ని నరసరావుపేట గవర్నమెంట్ ఆసుపత్రికి తరలించారు. ఆచూకి ఎవరైనా తెలిసిన వారు ఉంటే మాచర్ల పట్టణ పోలీస్ స్టేషన్ సమాచారం ఇవ్వాలని ఎస్ఐ సంధ్యారాణి కోరారు.

ఐదుగురు జూదరుల అరెస్టు

ప్రజాశక్తి - కొల్లిపర

మండలంలోని అన్నవరం లంక పొలాలలో పేకాట ఆడుతున్న వారిపై సోమవారం రైడ్ చేసిఐదుగురిని అదుపులోకి తీసుకున్నామని ఎస్ఐ కోటేశ్వరరావు తెలిపారు. వారి వద్ద నుండి రూ.3080 నగదు, 3 ద్విచక్ర వాహనాలు సీజ్ చేసి స్టేషన్‌కి తరలించామని తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేశామని తెలిపారు. అనుమతి పత్రాలు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఆరు ఇసుక ట్రాక్టర్లను అదుపులో తీసుకొని రూ.60 వేల అపరాధ రుసుము విధించినట్లు ఎస్సై కోటేశ్వరరావు తెలిపారు.

కారులో వింత శబ్దాలు

ప్రజాశక్తి-తాడేపల్లి

తాడేపల్లి పట్టణంలోని అంబేద్కర్ కాలనీ (యానాదుల కాలనీ) సమీపంలోని స్మశానంకు కొద్ది దూరంలో పది రోజుల క్రితం గుర్తు తెలియని వ్యక్తులు ఓ కారును వదిలి వెళ్లారు. ఈ కారులో నుండి వింత శబ్దాలు వినబడుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. తాడేపల్లి పోలీసులకు సమాచారం అందించిన ఇంతవరకు పట్టించుకోలేదని తెలిపారు. కారులో నుండి రాత్రిపూట వింత శబ్దాలు ఇప్పటికీ వస్తున్నా యని వాపోతున్నారు. తాడేపల్లి పోలీసులు కారును స్వాధీనం చేసుకొని, విచారించాలని స్థానికులు కోరుతున్నారు.

లారీ ఢీకొని ఒకరు మృతి

ప్రజాశక్తి - పెదకూరపాడు

మండలంలోని తాళ్లూరు పరస గ్రామాల మధ్య లారీ వ్యక్తిని ఢీ కొట్టింది దీంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. తాళ్లూరు గ్రామానికి చెందిన వి కోటిరెడ్డి (38) ఖమ్మంపాడు వైపు నుండి తమ గ్రామం వస్తున్నాడు. పరస దాటిన తర్వాత లారీ ఢీ కొట్టింది. అతను మృతి చెందాడు. మృతునికి భార్య , కుమారుడు, కుమార్తె ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



తహశీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న సభ్యులు

బస్సులను క్రోసూరు వరకూ నడపాలి

ప్రజాశక్తి - పెదకూరపాడు

గుంటూరు నుండి పెదకూరపాడు మీదుగా క్రోసూరు వరకు ఆర్టీసీ బస్సులను నడపాలని పెదకూరపాడు అభ్యుదయ వేదిక కోరింది. ఈ మేరకు తహశీల్దార్ దానియేలుకు సోమవారం విన్నవించారు. ఈ సందర్భంగా వేదిక కన్వీనర్ దర్శి శేషారావు మాట్లాడుతూ ప్రస్తుతం గుంటూరు నుండి పెదకూరపాడు మీదుగా గారపాడు వరకు బస్సులు నడుస్తున్నాయని, ఆ బస్సులను క్రోసూరు వరకు పొడిగిస్తే నియోజకవర్గ కేంద్రమైన పెదకూరపాడుకు, క్రోసూరు అచ్చంపేట ప్రాంత ప్రజలకు రావడానికి, మార్గం సుగమనం అవుతుందని వివరించారు. ఆ ప్రాంత ప్రజలు గుంటూరు వెళ్లటానికి దూరం కూడా తగ్గుతుందన్నారు. పొడిగించడం సాధ్యం కాకపోతే ప్రత్యేక సర్వీసులు ఏర్పాటు చేయాలన్నారు. గుంటూరు నుండి పెదకూరపాడుకు ఎక్స్‌ప్రెస్ బస్సులను నడపాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో ఎం.మస్తాన్‌రావు, సిహెచ్ అంకమ్మ, పి.శ్రీనివాసరావు, డి.సురేష్, రాజేష్ పాల్గొన్నారు.



స్టేషన్‌ను పరిశీలిస్తున్న డీఎస్పీ జగదీష్

విద్వేషాలు రెచ్చగొడితే కేసులు : డీఎస్పీ

ప్రజాశక్తి - రెంటచింతల

సంపన్నుల నుంచి సామాన్యుల వరకు అందరికీ తాము అండగా ఉంటామని, ప్రతి ఒక్కరూ సహాయం కోరేది పోలీసులేనని గురజాల డీఎస్పీ జగదీష్ అన్నారు. డీఎస్పీగా బాధ్యతలు చేపట్టిన ఆయన రెంటచింతల పోలీస్‌స్టేషన్ మొదటిసారిగా సోమవారం సందర్శించారు. సోషల్ మీడియాలో విద్వేషాలు రెచ్చగొడితే కఠిన చర్యలు తీసుకుంటామని, వ్యక్తుల పైన సంస్థల పైన హేయమైన పదజాలంతో ట్రోలింగ్ చేసినా బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు డీఎస్పీ వెంట కారంపూడి సిఐ టివి.శ్రీనివాసరావు, ఎస్ఐ సిహెచ్.నాగార్జున, సిసి బాష, రమణమూర్తి ఉన్నారు.

ప్రధానమంత్రి స్వనిధిని సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి- మాచర్ల రూరల్

ప్రధానమంత్రి వీధి వ్యాపారుల ఆత్మనిర్భర్ నిధి (స్వనిధి)ని వీధి వ్యాపారులు సద్వినియోగం చేసుకోవాలని మాచర్ల మున్సిపల్ ఛైర్మన్ పోలూరి నరసింహారావు, కమిషనర్ వేణుబాబు సూచించారు. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా) ఆధ్వర్యంలో సోమవారం అవగాహన ర్యాలీని మున్సిపల్ ఛైర్మన్ ప్రారంభించి మాట్లాడారు. ఈ పథకం ద్వారా రోడ్ల వెంబటి వ్యాపారాలు చేసుకునే వారు వడ్డీ లేని రుణాలు పొందవచ్చన్నారు. అనతరం ఎంఎస్ఎంఇ రిజిస్ట్రేషన్ గురించి అవగాహన కల్పించారు. మెప్మా అధికారి రాజశేఖర్, వీధి వ్యాపారులు పాల్గొన్నారు.



బాత్రూంలు మేమే కడగాలి.. అన్నమూ సరిగా పెట్టరు..

ఎమ్మెల్యే ఎదుట నూజెండ్ల హాస్టల్ విద్యార్థుల ఆవేదన



ఎమ్మెల్యేకు పరిస్థితులను వివరిస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి - నూజెండ్ల

అన్నం సరిగా పెట్టరు.. బాత్ రూంలు కూడా మాతోనే కడిగిస్తారు.. అని ఎమ్మెల్యే ఎదుట హాస్టల్ విద్యార్థులు వాపోయారు. ప్రజాదర్బార్‌లో పాల్గొనేందుకు మండల కేంద్రమైన నూజెండ్లకు సోమవారం వచ్చిన ఎమ్మెల్యేను విద్యార్థులు కలిసి తమ దుస్థితిని పరిశీలించాలని కోరారు. దీంతో ఆయన హాస్టల్‌ను సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వర్షం వస్తే వసతి గదులు కారుతున్నాయని, పారిశుధ్యం క్షీణించిందని, దోమల బెడద అధికంగా ఉందని, హాస్టల్లో టాయిలెట్స్ పిల్లలతో కడిగిస్తున్నారని, కరెంటు కొరత, వసతి గహాల్లో ఫ్యాన్లు లేక ఇబ్బందులు పడుతున్నామని, మెనూ ప్రకారం భోజనం పెట్టడం లేదని, తాగునీరు కూడా సక్రమంగా లేదని ఎమ్మెల్యే ఎదుట విద్యార్థులు వాపోయారు. ఈ సమస్యలు విన్న ఎమ్మెల్యే తీవ్ర అసంతృప్తికి గురయ్యారు. ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యలను పరిష్కరించాలన్నారు.

ప్రజాదర్బార్‌లో 139 వినతులు

ఇదిలా ఉండగా మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ప్రజల నుండి అర్జీలను ఎమ్మెల్యే స్వీకరించారు. మొత్తం 139 వినతులు రాగా వారితో ఎమ్మెల్యే నేరుగా మాట్లాడి సమస్యలు



ఎమ్మెల్యేకు హాస్టల్ పరిసరాలను చూపుతున్న విద్యార్థులు

తెలుసుకున్నారు. అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని, అలసత్వం వహిస్తే ఉపేక్షించేది లేదని అధికారులను ఆదేశించారు. వైసిపి పాలనలో రీసర్వే అక్రమాలు, ఊరురా భూకబ్జాలు తప్ప ఏం చేశారో బహిరంగ చర్చకు సిద్ధమన్నారు. ఇకపై ఎవరైనా భూ ఆక్రమణకు ప్రయత్నిస్తే కూటమి ప్రభుత్వం కొత్తగా తెచ్చిన భూ కబ్జాల నియంత్రణ చట్టం ద్వారా నేరుగా జైళ్లకు పంపిస్తామని హెచ్చరించారు.

నిర్మాణ వ్యర్థాల కోసం డిపాజిటరీ పాయింట్లు

నూరుశాతం చెత్త విభజన జరగాలి : కలెక్టర్ - పర్యావరణ ప్రణాళికకు ఆమోదం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా



అన్ని మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీల్లో 100 శాతం చెత్త విభజన జరగాలని అధికారులను పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఆదేశించారు. ప్లాస్టిక్ వ్యర్థాలు, ఆహార వ్యర్థాలు, కెమికల్ వ్యర్థాలు, నిర్మాణ రంగ వ్యర్థాలు వంటి అన్ని రకాల చెత్తను ఎక్కడికక్కడ విభజించి సేకరించాలన్నారు. పర్యావరణ ప్రణాళికపై నరసరావుపేటలోని కలెక్టరేట్‌లో అధికారులతో సోమవారం సమీక్షించి పర్యావరణ ప్రణాళికకు ఆమోదం తెలిపారు. ప్రణాళికలో భాగంగా వచ్చే ఏడాది మే 31 నాటికి జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ఇంటి వద్దే చెత్త సేకరణ జరగాలన్నారు. అక్టోబరు 31 నాటికి అన్ని మున్సిపాలిటీల్లో నాన్ రీసైక్లబుల్ వేస్ట్ నిర్వహణ కోసం శానిటరీ లాండ్ ఫిల్స్ ఏర్పాటు చేయాలన్నారు. మున్సిపాలిటీల్లో నిర్మాణ రంగ వ్యర్థాలు, ఈ వ్యర్థాల సేకరణ, నిర్వహణ కోసం డిపాజిటరీ పాయింట్లు ఏర్పాటు చేయాలన్నారు. పారిశ్రామిక వ్యర్థాల నిర్వహణ నదీ జలాల పరిరక్షణ కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, శాఖల వారీగా పర్యావరణ పరిరక్షణపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని చెప్పారు. కార్యక్రమంలో గుంటూరు పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ప్రాంతీయ శాఖ ఈఈ నజీనా బేగం మొహమ్మద్, జిల్లా పరిశ్రమల అధికారి సుధాకర్, డీఎంహెచ్‌ఓ రవి, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.



ఆక్రమణల తొలగింపులో పొక్లెయినర్

ఫుట్‌పాత్‌లు, డ్రెయినేజీలపై ఆక్రమణల తొలగింపు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట పట్టణపరిధిలో రోడ్డు మార్జిన్ ఫుట్‌పాత్‌లపై, డ్రెయినేజీల మీద ఆక్రమణల తొలగింపును మున్సిపల్ అధికారులు సోమవారం చేపట్టారు. స్థానిక స్టేషన్ రోడ్డులోని ఫుట్ పాత్‌లపై, డ్రెయినేజీలను ఆక్రమించి వ్యాపారాలు కొనసాగించడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోందని, వర్షకాలం సమయంలో మురుగు నీరు నిల్వ ఉండడం వల్ల పట్టణ ప్రజలు అనారోగ్య సమస్యలకు గురవుతున్నారని మున్సిపల్ అధికారులు చెబుతున్నారు. ఈ ప్రక్రియ పట్టణంలోని అన్ని ప్రధాన రోడ్లలోని ఆక్రమణల తొలగింపు పూర్తి చేస్తామంటున్నారు. ఎవరికి వారు ఆక్రమణలను స్వచ్ఛందంగా తొలగించాలని కోరారు.


నమ్మకంతో వస్తారు.. సావధానంగా వినండి



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్)కు వచ్చే ప్రతిఫిర్యాదూ పరిష్కారం కావాలని అధికారులను పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ప్రజల నుండి 51 అర్జీలను కలెక్టర్‌తోపాటు ఇతర అధికారులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తమ సమస్యలు పరిష్కారం అవుతాయానే నమ్మకంతో అర్జీదారులు వస్తుంటారని, వారి సమస్యలను సావధానంగా విని, సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఇందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు.



వక్ఫ్ భూముల వేలాన్ని ఆపండి

నరసరావుపేట మండలం ములకలూరులో వక్ఫ్ బోర్డుకు చెందిన 30 ఎకరాల పీర్లమాన్యం భూములను వక్ఫ్‌బోర్డు వేలం వేయకుండా ఆపాలని రైతులతో కలిసి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఫిర్యాదు చేశారు. ఆ భూముల్లో గ్రావెల్ తవ్వకాలు జరగకుండా నిలిపేయాలన్నారు. గ్రామంలో పీర్ల మాన్యానికి సంబంధించిన 13 ఎకరాల వక్ఫ్ బోర్డు ఆధీనంలోని భూమిని గత 80 ఏళ్లుగా కొందరు మైనార్టీ రైతులు ఒక్కో రైతు 40 సెంట్లు చొప్పున సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని, ఆ భూములపై కన్నేసిన టిడిపి నాయకుడు ఆక్రమించాలనే దురుద్దేశంతో వక్ఫ్ బోర్డు అధికారులపై ఒత్తిడి తెచ్చి, ఆ భూమిని వేలం వేయాలని చూస్తున్నారని చెప్పారు. ఇదే జరిగితే 80 చిన్న, సన్నకారు రైతులు జీవనోపాధి కోల్పోతారని తెలిపారు. ఆ భూముల్లో గ్రావెల్ తీసి అమ్ముకోవడం కోసం కుట్రలలో భాగంగా వేలం ప్రక్రియకు తెరలేపారన్నారు. అదే జరిగితే ఈ భూమి భవిష్య తరాలకు పనికిరాదన్నారు. కలెక్టర్ స్పందిస్తూ వక్ఫ్ బోర్డు అధికారులతో మాట్లాడి వేలం ఆపాలని ఆదేశాలిచ్చారని, ఉన్నతాధికారులతో మాట్లాడి రైతులకు న్యాయం జరిగేటట్లు చేస్తానని హామీ ఇచ్చారని చెప్పారు.

వైసిపి కార్యకర్తపై దాడి చేసిన వారిని శిక్షించాలి

నరసరావుపేట పట్టణం చీకటి కాలనీకి చెందిన వైసిపి కార్యకర్త అన్నపురెడ్డి మంగయ్యను గుర్తు తెలియని వ్యక్తులు మాస్కులు వేసుకొని కర్రలు, రాడ్లతో కొట్టి, కాళ్ళు, చేతులు విరగ్గొట్టడం దారుణమని పలువురు ఫిర్యాదు చేశారు. దాడి జరిగిన రోజే పోలీసులకు ఫిర్యాదు చేసినా కేసు నమోదు చేసిన పోలీసులు నిందితులను పట్టుకోవడంలో తాత్సారం చేస్తున్నారని, విచారణలో నిర్లక్ష్యం ఎందుకని మండిపడ్డారు. పోలీసులు నిర్లక్ష్యం చేస్తే ఎస్పీ దష్టికి తీసుకువెళ్తామని నిందుతులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మార్గదర్శకాల ప్రకారం డిమాండ్ సర్వే చేపట్టాలి

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లాలో ఇళ్ళు నిర్మించుకునే వారిని నిర్దేశిత మార్గదర్శకాల ప్రకారం ప్రధానమంత్రి అవాస్ యోజన 2.0 డిమాండ్ సర్వేలో నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్ నుండి వీడియో కాన్ఫరెన్స్ సమావేశం ద్వారా జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి అభివద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ప్రత్యేక అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, మండలస్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పీఎంఏవై 2.0 డిమాండ్ సర్వేలో నమోదు అయిన లబ్ధిదారులకు మాత్రమే ఇళ్ళ మంజూరు చేయటం జరుగుతుందని, గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో సొంత స్థలాలు, హౌసింగ్ లేఅవుట్లలో స్థలాలు ఉన్న వారిని గుర్తించి డిమాండ్ సర్వేలో సచివాలయ ఉద్యోగులు ఖచ్చితంగా నమోదు చేసేలా మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు పర్యవేక్షించాలన్నారు. హౌసింగ్ లేఅవుట్లలో ఇళ్ళ నిర్మాణాలను ప్రతివారం నిర్దేశించిన లక్ష్యాలను ఖచ్చితంగా అధిగమించాలన్నారు. అంగన్వాడీ కేంద్రాలలో సక్షమ్ ద్వారా మంజూరు చేసిన త్రాగునీరు సరఫరా, మరుగుదొడ్ల నిర్మాణం, పోషణ్ వాటికల ఏర్పాటు శనివారం నాటికి ఖచ్చితంగా పూర్తి చేయాలన్నారు.సచివాలయ పరిధిలో గహాల మ్యాపింగ్, ఎన్‌సిడి సర్వే నూరు శాతం వెంటనే పూర్తి అయ్యేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలన్నారు.సమావేశంలో జెడ్పీ సిఇఒ జ్యోతిబసు, సీపిఓ శేషశ్రీ, హౌసింగ్ పీడీ ప్రసాద్, డ్వామా పీడీ శంకర్, డీపీఓ సాయికుమార్, ఉద్యానశాఖ అధికారి రవీందర్ బాబు, ఐసీడీసీ పీడీ ఉమాదేవి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్

రేపు, ఎల్లుండి తాగునీటి సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగరానికి తాగునీటిని సరఫరా చేసే 1600 ఎంఎం డయా పైప్‌లైన్‌కు తక్కెళ్లపాడు వద్ద ఏర్పడిన లీకులకు మరమ్మతులు చేపడుతున్న దృష్ట్యా 11, 12 తేదీల్లో తాగునీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం సరఫరా అనంతరం పనులు చేపడతారన్నారు. ఈ పనుల వల్ల నగరంలోని నెహ్రూనగర్, శారదాకాలనీ, వసంత రాయపురం, హెచ్ఎల్ఆర్, ఐపిడి కాలనీ, స్తంభాల గరువు, గుజ్జనగుండ్ల, విద్యానగర్, హనుమయ్యనగర్, నల్లచెరువు, శ్రీనివాసరావుతోట, తారకరామ నగర్, ఏటి అగ్రహారం, బిఆర్ స్టేడియం, ఎల్బి నగర్, గోరంట్ల, అడవి తక్కెళ్లపాడు, రాజీవ్ గాంధీ నగర్, కోర్ట్ కాంపౌండ్, మిర్చి యార్డ్, హౌసింగ్ బోర్డ్ కాలనీ, కేవిపి కాలనీ, శ్యామలానగర్, రెడ్డిపాలెం రిజర్వాయర్ల పరిధిలో పూర్తిగా త్రాగునీటి సరఫరా నిలిచిపోతుందన్నారు. శుక్రవారం ఉదయం నుండి యధావిధిగా సరఫరా జరుగుతుందని, కావున ప్రజలు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకొని, నగరపాలక సంస్థకు సహకరించాలని కోరారు.

అంతర్జాతీయ టెన్నిస్ క్రీడాకారిణి ప్రాంజులకు సన్మానం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ప్రముఖ టెన్నిస్ క్రీడాకారిణీ ప్రాంజుల ఎడ్లపల్లిని స్థానిక వివివి హెల్త్ హబ్‌లో సోమవారం ఘనంగా సన్మానించారు. ప్రాంజుల గతంలో జూనియర్ విభాగంలో వింబుల్డన్, ఆస్ట్రేలియా ఓపెన్, ఫ్రెంచ్ ఓపెన్, యూఎస్ ఓపెన్ టెన్నిస్ టోర్నమెంట్లో భారతదేశం తరపున పాల్గొని మేటి ప్రతిభను కనబరిచారు. గుంటూరులో జరిగిన గుంటూరు ఓపెన్ పికిల్ బాల్ టోర్నమెంట్ బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమంలో ఆమెను ఘనంగా సన్మానించి జ్ఞాపిక ను బహుకరించారు. ఈ సందర్భంగా న్యాయవాది చిగురుపాటి రవీంద్ర బాబు మాట్లాడుతూ ప్రాంజులను ప్రతి టెన్నిస్ క్రీడాకారులు ఆదర్శంగా తీసుకొని భారతదేశానికి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని కోరారు. రేమండ్స్ షోరూమ్ అధినేత వివి వి హెల్త్ హాఫ్ డైరెక్టర్ టీ అరుణ్ కుమార్ మాట్లాడుతూ ప్రపంచంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన టెన్నిస్ టోర్నమెంట్‌లలో ప్రాంజులా పాల్గొనడం గర్వించదగ్గ విషయమని తెలిపారు. రాబోయే రోజుల్లో మహిళలు విభాగంలో కూడా పాల్గొని భారత దేశ కీర్తి ప్రతిష్టలను పెంపొందించాలని కోరారు. నేటి యువ టెన్నిస్ క్రీడాకారులు అందరూ ప్రాంజుల ను ఆదర్శంగా తీసుకొని టెన్నిస్‌లో రాణించడానికి కృషి చేయాలని కోరారు.కార్యక్రమంలో ఏపీ పీకిల్ బాల్ సంఘం కార్యదర్శి ఎన్ శ్రీధర్, డాక్టర్ రసూల్, జి వి ఎస్ ప్రసాద్, నాగరాజు, చరణ్, గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.



ప్రాంజులను సన్మానిస్తున్న వివి వి హెల్త్ ఆఫ్ డైరెక్టర్ లు టి అరుణ్ కుమార్, హరికృష్ణ

12న నిమ్మగడ్డ వర్ధంతి సభ

జయప్రదం చేయాలని నాయకుల పిలుపు

ప్రజాశక్తి మంగళగిరి

మంగళగిరి మాజీ ఎమ్మెల్యే, సిపిఎం జిల్లా నాయకులు నిమ్మగడ్డ రామ్మోహన్ రావు వర్ధంతి సందర్భంగా 12వ తేదీన మండల పరిషత్ గేటుకి ఎదురుగా ఉన్న నిమ్మగడ్డ విగ్రహం వద్ద బహిరంగ సభ జరుగుతుందని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్ ఎస్ చెంగయ్య తెలిపారు. సోమవారం సాయంత్రం మంగళగిరి సిపిఎం కార్యాలయంలో సిపిఎం పట్టణ కమిటీ సమావేశం ఎం బాలాజీ అధ్యక్షతన జరిగింది. చేంగయ్య తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ మంగళగిరి ఎమ్మెల్యేగా నియోజవర్గంలో అనేక అభివద్ధి కార్యక్రమాలు చేశారని అన్నారు. 12 వ తేదీ సాయంత్రం ఐదు గంటలకు నిమ్మగడ్డ విగ్రహం వద్ద బహిరంగ సభ జరుగుతుందని తెలిపారు. ఈ సభలో సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు పాల్గొని ప్రసంగిస్తారని తెలిపారు. సిపిఎం పట్టణ కార్యదర్శి వివి జవహర్లాల్ మాట్లాడుతూ బహిరంగ సభలో సిపిఎం సభ్యులు, సానుభూతిపరులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సిపిఎం సీనియర్ నాయకులు జెవి రాఘవులు, పి బాలకష్ణ, పట్టణ కమిటీ సభ్యులు ఎం నాగేశ్వరావు, ఎస్ గణేష్, ఆర్ వేణు, ఎం చలపతిరావు, టి శ్రీనివాసరావు, వి శ్రీనివాసరావు, ఎం చంద్రారావు తదితరులు పాల్గొన్నారు.

వర్సిటీ ఫార్మసీ కళాశాల ఆధ్వర్యంలో

రేపటి నుండి జాతీయ సదస్సు

ప్రజాశక్తి - ఏఎన్‌యు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని ఫార్మసీ కళాశాల ఆధ్వర్యంలో రెండు రోజుల జాతీయ సదస్సును నిర్వహిస్తున్నట్లు సదస్సు డైరెక్టర్ డాక్టర్ డి .రవిశంకర్ రెడ్డి తెలిపారు. 11, 12 తేదీల్లో యూజీసీ ఆర్థిక సహకారంతో 'మల్టీ డిసిప్లినరీ రీసెర్చ్ ఇన్ డ్రగ్ డిస్కవరీ అండ్ డెవలప్మెంట్' అనే అంశంపై సదస్సును నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సదస్సుకు ఇన్చార్జి వీసీ ఆచార్య కే .గంగాధరరావు ముఖ్య అతిథిగా పాల్గొంటున్నారని, ముఖ్య ఉపన్యాసకులుగా జబల్పూర్ లోని మంగళయాటెన్ యూనివర్సిటీ వీసి ఆచార్య కేఆర్ఎస్. సాంబశివరావు, భారత ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ జాయింట్ డైరెక్టర్ సైంటిస్ట్ డాక్టర్ ఐ. బాలకృష్ణ ప్రసంగించనున్నారని పేర్కొన్నారు. ఈ సదస్సులో ఆల్ అమీన్ కాలేజ్ ఆఫ్ ఫార్మసీ ప్రిన్సిపల్ ఆచార్య ఎండి. సలాహుద్దీన్ తిరువనంతపురం క్యాన్సర్ సెంటర్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ గురువాయూరప్ప చంద్రశేఖర్, హైదరాబాదులోని నరసింహారెడ్డి ఎడ్యుకేషనల్ సొసైటీ గ్రూప్ స్కూల్ ఆఫ్ ఫార్మసీ డీన్ తెలంగాణ ఏపీ టీ ఐ ప్రెసిడెంట్ ఆచార్య సిహెచ్. కృష్ణమోహన్ తదితరులు పాల్గొంటారని వివరించారు. జాతీయ సదస్సు ప్రారంభోత్సవ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఏ. ప్రమీల రాణి అధ్యక్షత వహిస్తారని పేర్కొన్నారు. సదస్సుకు కో కన్వీనర్ గా డాక్టరు అన్నపూర్ణ, ఆర్గనైజింగ్ సెక్రటరీగా డాక్టర్ కే . సుజన, కోశాధికారిగా డాక్టర్ కే ఈ ప్రవల్లిక, జాయింట్ ఆర్గనైజింగ్ సెక్రటరీగా డాక్టర్ కే . మస్తానమ్మ తదితరులు వ్యవహరిస్తారని తెలిపారు.

యోగా కోర్సుకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - ఏఎన్‌యు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ వ్యాయామ కళాశాలలో 2024 -25 విద్యా సంవత్సరానికి యోగా కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వ్యాయామ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య పి. జాన్సన్ తెలిపారు. యమ్.ఎస్.సి. యోగా రెండవ సంవత్సరం లేటరల్ ఎంట్రీ (పీజి డిప్లొమా ఇన్ యోగా చేసిన వారు) కోర్సుకు, యమ్.ఎస్.సి యోగా మొదటి సంవత్సరం కోర్సుకు, పీజి డిప్లొమా ఇన్ యోగా కోర్సులకు ప్రవేశాలు కల్పిస్తామని పేర్కొన్నారు. యమ్.ఎస్.సి యోగా రెండవ సంవత్సరం లేటరల్ ఎంట్రీ కోర్సుకు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం నుండి పీజి డిప్లమా ఇన్ యోగా కోర్సులో ఉత్తీర్ణులైన అభ్యర్థులు అర్హులుగా నిర్ణయించామని తెలిపారు. యమ్.ఎస్.సి యోగా మొదటి సంవత్సరం, పీజి డిప్లమా ఇన్ యోగా కోర్సుకు ఏదైనా డిగ్రీ కోర్సు ఉత్తీర్ణులైన వారు దరఖాస్తులు చేసుకోవచ్చునని చెప్పారు. ప్రవేశాలకుఈనెల 16లోగా దరఖాస్తులు చేసుకోవచ్చునని అయన తెలిపారు. వివరాలకు 9440315340, 7396458123 లను సంప్రదించాలని కోరారు.

ఉపాధ్యాయ ఉద్యమ నిర్మాత చెన్నుపాటికి ఘన నివాళి

ప్రజాశక్తి-గుంటూరు

ఆంధ్రప్రదేశ్‌లో ఉపాధ్యాయులు, ఉద్యోగులు సంఘాలు ఏర్పాటు చేసుకునే హక్కును సాధించిపెట్టిన మహనీయుడు చెన్నుపాటి లక్ష్మయ్య అని యుటిఎఫ్ రాష్ట్ర ప్రచురణల కమిటీ చైర్మన్ ఎం.హనుమంతరావు అన్నారు. సోమవారం బ్రాడీపేటలోని యుటిఎఫ్ కార్యాలయంలో చెన్నుపాటి వర్ధంతి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా హనుమంతరావు మాట్లాడుతూ ఉపాధ్యాయ ఉద్యమం కోసం చెన్నుపాటి తన జీవితాన్ని త్యాగం చేశారని అన్నారు. సంఘాన్ని స్థాపించడమే కాకుండా రాష్ట్రం మొత్తం పర్యటించి ఉపాధ్యాయులను ఏకం చేస్తూ సంఘాన్ని బలోపేతానికి అహర్నిశలూ కృషి చేశారన్నారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యు.రాజశేఖర్‌రావు, యం.కళాధర్ మాట్లాడుతూ చెన్నుపాటి ఆశయాల సాధనకు కృషి చేస్తామన్నారు. ఉపాధ్యాయుల హక్కుల సాధనలో చెన్నుపాటి స్ఫూర్తితో రాజీలేని పోరాటం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాధ్యక్షులు జి.వెంకటేశ్వర్లు, నాగమణి, జిల్లా కార్యదర్శులు, సిహెచ్.ఆదినారాయణ, యం.గోవిందు, కె.రంగారావు, బెల్లంకొండప్రసాద్, ఆడిట్ కమిటీ సభ్యులు ఎం.కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



చెన్నుపాటి చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న నాయకులు

మహిళలకు రక్షణ కల్పించడంలో ప్రభుత్వాలు విఫలం : ఐద్వా

ప్రజాశక్తి-గుంటూరు

ఐద్వా ఆధ్వర్యంలో నవంబర్ 25 నుంచి డిసెంబర్ 10వతేదీ వరకూ హింస వ్యతిరేక వారోత్సవాలలో భాగంగా సోమవారం స్థానిక గుజ్జనగుండ్లలో ఐద్వా సమావేశం జరిగింది. ఐద్వా నగర కార్యదర్శి ఎ.కళ్యాణి పాల్గొని మాట్లాడుతూ మహిళలపై, చిన్నారులపై రోజురోజుకీ హింస పెరిగిపోతుందని, హింసని అరికట్టడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని అన్నారు. ప్రధానంగా మద్యం, గంజాయి విక్రయాలు, సోషల్ మీడియాలో అశ్లీల వెబ్సైట్లను నియంత్రించడంలో ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి లేదని అన్నారు. మహిళా హక్కులూ మానవ హక్కులేనని, కావున రాజ్యాంగం కల్పించిన ఈ హక్కును ప్రభుత్వాలు చిత్తశుద్ధితో కాపాడాలన్నారు. అనంతరం ఐద్వా నూతన కమిటీని ఎన్నుకున్నారు. కమిటీకి కార్యదర్శిగా షేక్.షకీల, అధ్యక్షులుగా కె.భవాని ఎన్నికయ్యారు. ఈకార్యక్రమంలో నిర్మల, జుబేదా, ఆషా, అంజలి, అన్నా మేరీ, సమీరా, నగ్మా బాయి, బాజీ, నాగూర్‌బి పాల్గొన్నారు.



నిరసన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎ కళ్యాణి

టెన్నిస్‌లో సత్తా చాటిన సూక్తిశ్రీ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా
విశాఖపట్నం నగర పరిధిలోని మధురవాడ సాయి ప్రియా లేఅవుట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన సౌత్ ఇండియా జూనియర్ హార్డ్ టెన్నిస్ ఛాంపియన్ షిప్ పోటీల్లో నరసరావుపేట పట్టణానికి చెందిన పి.సూక్తి శ్రీ అండర్ -10 విభాగంలో ప్రతిభ చాటి, విజేతగా నిలిచింది. మధురవాడలో జరిగిన ఈ పోటీలను ప్రభుత్వ విప్, ఇచ్ఛాపురం ఎమ్మెల్యే డాక్టర్ బెందాళం అశోక్ ప్రారంభించి క్రీడాకారులను అభినందించారు. పోటీల్లో ఏపీ, తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన అండర్-14 విభాగాలకు చెందిన 80 మంది బాల బాలికలు పాల్గొన్నారు. అండర్ 10 విభాగంలో సూక్తిశ్రీ ప్రతిభ చాటి, విజేతగా నిలిచిందని కోచ్ బి.బాబునాయక్ తెలిపారు. నరసరావుపేట పట్టణానికి చెందిన డాక్టర్ పి.శ్రీనివాస్, సురేఖ దంపతుల కుమార్తె సూక్తిశ్రీ.. ప్రకాష్ నగర్ లోని సిబిఐటి స్కూల్ లో 6 వ తరగతి చదువుతుంది. చదువులో రాణిస్తూనే మరో వైపు నాలుగేళ్లుగా టెన్నిస్‌లో ప్రతిభ చూపుతోంది. ఈ సందర్భంగా సూక్తిశ్రీ ని కోచ్ బాబునాయక్‌తో పాటు సిబిఐటి స్కూల్ డైరెక్టర్ యోగిరెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు. జాతీయ స్థాయి పోటీలో రాణించి పల్నాడు జిల్లాకు, తల్లిదండ్రులకు, కోచ్ బాబూ నాయక్‌కు, పాఠశాలకు పేరు ప్రఖ్యాతులు తీసుకురావడం తన లక్ష్యమని చిన్నారి సూక్తిశ్రీ తెలిపింది.


క్రీడాకారులను అభినందిస్తున్న విప్ అశోక్


విజేతగా నిలిచిన సూక్తిశ్రీ

నేడు గుండ్లపాడులో రెవెన్యూ సదస్సు

ప్రజాశక్తి- వెల్దుర్తి
మండల పరిధిలోని గుండ్లపాడు గ్రామంలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించనున్నట్లు తహసీల్దారు బాషా తెలిపారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సదస్సు ఉంటుందని.. రైతులకు భూసమస్యలు ఏమైనా ఉంటే అర్జీలు అందజేయవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమానికి వీఆర్వోలు, వీఆర్ఏలు, రెవెన్యూ సిబ్బంది హాజరవుతారని తెలిపారు.

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - యడ్లపాడు
యడ్లపాడు సెక్షన్ పరిధిలోని స్పైసెస్ పార్క్ సబ్ స్టేషన్ పరిధి వంకాయలపాడు ఫీడర్, కొండవీడు సబ్‌స్టేషన్‌లో కొండవీడు ఫీడర్ మరమ్మతుల కారణంగా మంగళవారం పలు ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఆ శాఖ డీఈఈ ఆర్.అశోక్‌కుమార్ తెలిపారు. కొండవీడు, కోట, సొలస, లింగారావుపాలెం, చెంగిజ్ ఖాన్ పేట పరిసర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోనుందని పేర్కొన్నారు.



సమస్యలు పరిష్కరిస్తా : మున్సిపల్ ఛైర్మన్

ప్రజాశక్తి- మాచర్ల
ప్రజలు తన దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను పరిష్కరిస్తున్నట్లు మున్సిపల్ ఛైర్మన్ పోలూరి నరసింహారావు తెలిపారు. సోమవారం పట్టణంలోని 22 వార్డ్ యాదవుల బజారు, 21వ వార్డు ఏరియా, ఒకటో వార్డు ఆజాద్ నగర్ బ్రిడ్జి ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. శాసనసభ్యులు జూలకంటి బ్రహ్మానందరెడ్డి దృష్టికి సమస్యలను తీసుకెళ్లి త్వరతగతిన రోడ్లపై గుంతలు, కాల్వలు, రోడ్ల మరమ్మతులు చేయిస్తామని ఆయన హామీ ఇచ్చారు.



వక్ఫ్ బోర్డు స్థలాలను పరిరక్షించాలి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా
వక్ఫ్ బోర్డుకు చెందిన విలువైన స్థలాలను ఆక్రమించి, ప్లాట్లుగా మార్చి అమ్ముకోవడానికి సిద్ధపడుతున్నవారిపై చర్యలు తీసుకోవాలని ఎంఐఎం నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం జిల్లా రెవెన్యూ అధికారి మురళిని కలిసి వినతిపత్రం అందించారు. ఎంఐఎం పట్టణ అధ్యక్షులు మౌలాలి, కార్యదర్శి ఆరిఫ్, జిల్లా అధ్యక్షులు కరీముల్లా మాట్లాడారు. నరసరావుపేట గుంటగార్లపాడు, రావిపాడు గ్రామ సర్వే నెంబర్ 132లో 12 ఎకరాలు వక్ఫ్ బోర్డుకు సంబంధించిన పీర్లమాన్యం, గుంటగార్లపాడు సర్వే నెంబర్ 75/3, 75/4 లలో 7 ఎకరాల పీర్ల మాన్యం ఉందన్నారు. ఈ సర్వేల్లో ఉన్న భూమిని కొంతమంది కబ్జా చేసి ప్లాట్లుగా విక్రయించి సొమ్ము చేసుకోవడానికి సిద్ధమయ్యారన్నారు. ఈ విషయంపై గతంలో ఎన్నోమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయిందన్నారు. కొంతమంది వక్ఫ్ బోర్డు అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే కోట్ల రూపాయలు విలువ చేసే భూమి కబ్జాలకు గురవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు.

ప్రకృతి వ్యవసాయంతోనే ఆరోగ్యకర ఆహారం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా
సమాజం, వ్యవసాయ రంగం, కుటుంబ వ్యవస్థ.. ఇలా ఎక్కడైనా మహిళల పాత్ర ఎంతో కీలకమని జిల్లా ప్రకృతి వ్యవసాయ అధికారిణి కె.అమల కుమారి అన్నారు. నరసరావుపేటలోని మున్సిపల్ అతిథి గృహంలో రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో సోమవారం కమ్యూనిటీ మేనేజ్ నేచురల్ ఫార్మింగ్, ఆరోగ్యం-పోషకాహారం విభాగంలోని డ్వాక్రా సంఘాల నుంచి ఎంపిక చేసిన ఆరోగ్య కమిటీ మెంబర్లకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యవసాయం-ఆరోగ్యంలో మహిళల ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ ఎస్.రాజగోపాల్ మాట్లాడుతూ వాతావరణంలోని మార్పు, రసాయనాల ప్రభావం వల్ల వ్యవసాయంపై చెడు ప్రభావం పడుతోందని తెలిపారు. తద్వారా పండిన పంటలో పోషకాల కొరత ఏర్పడుతోందని వివరించారు. ప్రత్యామ్నాయంగా ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చునని ఆమె తెలిపారు.



మాట్లాడుతున్న అమలకుమారి

ఘనంగా కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ జన్మదిన వేడుకలు


కేకు కట్ చేసి వేడుకలు జరుపుకొంటున్న కాంగ్రెస్ నాయకులు

ప్రజాశక్తి- సత్తెనపల్లి టౌన్
కాంగ్రెస్ పార్టీ అధినేత్రి సోనియా గాంధీ 78 వ జన్మదిన వేడుకలను స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జి చుక్క చంద్రపాల్ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రపాల్ మాట్లాడుతూ పేదల సంక్షేమానికి కట్టుబడిన ఘనత కాంగ్రెస్ పార్టీకి సొంతమన్నారు. కాంగ్రెస్ బలోపేతానికి సోనియా ఎంతగానో కృషి చేశారని చెప్పారు. ప్రధానిగా అవకాశం వచ్చినప్పటికీ.. మన్మోహన్‌సింగ్‌కు పదవిని కట్టబెట్టిన గొప్ప త్యాగశీలిగా కొనియాడారు. అనంతరం కేక్ ను కట్ చేసి నాయకులకు, కార్యకర్తలకు అందించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు డి.జ్ఞాన్‌రాజ్‌పాల్, చాంద్ బాషా, డిసిసి కార్యదర్శి ఎం.వేద్రాది, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

చెన్నకేశవ నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి- మాచర్ల
వాసవీ క్లబ్ మాచర్ల చెన్నకేశవ నూతన కార్యవర్గ ఎన్నిక సోమవారం పట్టణంలో నిర్వహించారు. క్లబ్ అధ్యక్షులుగా భవనాసి రవితేజ, కార్యదర్శిగా బత్తుల వీరబ్రహ్మం, కోశాధికారి బచ్చు రాజ్ కుమార్, సంయుక్త కార్యదర్శిగా మేడం శివరామకృష్ణలను క్లబ్ సభ్యులు ఎన్నుకున్నారు. నూతన కమిటీకి మున్సిపల్ ఛైర్మన్ పోలూరి నరసింహారావు, శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయ అధ్యక్షులు భవనాసి వెంకటేశ్వర్లు శాలువాలు కప్పి సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో 2025 జోన్ ఛైర్మన్ ఒరుగంటి చెన్నకేశవరావు, వ్యవస్థాపక అధ్యక్షులు తిరివీధి వెంకట నాగేశ్వరరావు, మేడం శివ నాగేశ్వరరావు, పందిరి నరసింహారావు పాల్గొన్నారు.


నూతన కార్యవర్గ సభ్యులను సన్మానిస్తున్న దృశ్యం

'బాలబాట'తో సంక్షేమ కార్యక్రమాలు



చీరలు, నిత్యావసరాలను పంపిణీ చేస్తున్న సంస్థ ప్రతినిధులు

ప్రజాశక్తి - యడ్లపాడు
మండల కేంద్రమైన యడ్లపాడులోని సుగాలి కాలనీలో ఉన్న బాలబాట కార్యాలయంలో సోమవారం బాలబాట కార్యకర్తలకు దుస్తులు, చీరలు, నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్డ్స్ స్వచ్ఛంద సేవా సంస్థ పల్నాడు జిల్లా డిప్యూటీ డైరెక్టర్ జి.సుబ్బారావు , విశ్రాంత ఏఎస్పై ఎం.వెంకటరత్నం మాట్లాడుతూ బాలబాట ద్వారా ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు విద్య, సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పర్యావరణ పరిరక్షణ, మహిళా అభ్యుదయం కోసం కృషి చేస్తున్నట్లు వివరించారు. సంస్థ యడ్లపాడు మండల కో ఆర్డినేటర్ కొమ్ము పద్మ, ప్రతిపాటి ఏలీష, పాస్టర్లు అల్లాడి కరుణానిధి, కొమ్ము ఇమ్మానియేల్, బోడ అబ్రహం, పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

చైతన్య పండ్ల మార్కెట్ అధ్యక్షునిగా అమీర్ బాషా

ప్రజాశక్తి- మాచర్ల రూరల్
మాచర్ల పట్టణ చైతన్య ఫ్రూట్ మార్కెట్ అధ్యక్షులుగా షేక్ అమీర్ బాషాను సోమవారం మార్కెట్ కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వైస్ ప్రెసిడెంట్ గా సయ్యద్ మహబూబ్ బాషా, ఓట్ల శీను, ప్రధాన కార్యదర్శిగా సత్యానంద్, కోశాధికారిగా దార్ల ఏసుదాసు ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు.. తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు ఎనుముల కేశవరెడ్డిని దుశ్శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా కేశవరెడ్డి మాట్లాడుతూ పట్టణంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా పండ్ల వ్యాపారాలు చేసుకోవాలని సూచించారు. కమిటీ సభ్యులు ఐక్యమత్యంతో మెలగాలన్నారు.


నూతన కమిటీతో టీడీపీ నాయకులు కేశవరెడ్డి



రహదారి విస్తరణ పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-తెనాలిరూరల్

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయమని తెనాలి మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అన్నారు. తెనాలి పట్టణాభివృద్ధిలో భాగంగా స్థానిక శివాజీ చౌక్ నుంచి పాత రత్నా టాకీస్ వరకు రహదారి విస్తరణ పనులకు సోమవారం ఆమె శంకుస్థాపన చేశారు. రూ.25.50 లక్షలు అంచనా వ్యయంతో 125 మీటర్ల మేర విస్తరణ పనులకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. తెనాలి పట్టణాభివద్ధితో పాటు ప్రజలు ఎదుర్కొంటున్న ట్రాఫిక్ సమస్యలను అధిగమించడానికి రహదారి పనులను వేగవంతం చేశామని చెప్పారు. కార్యక్రమంలో 5వ వార్డు కౌన్సిలర్ తోట రఘురామ్, కో అప్షన్ మెంబరు షేక్ సుభాని, మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, ఎంఈ ఆకుల శ్రీనివాసరావు, ఏఈ సూరిబాబు, టీపీవో సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

'అదానీ అవినీతిని ప్రశ్నించలేని ప్రభుత్వం'

ప్రజాశక్తి - మంగళగిరి

అదానీ అవినీతిని ప్రశ్నించలేని స్థితిలో కూటమి ప్రభుత్వం ఉందని సీపీఐ మంగళగిరి నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య విమర్శించారు. దేశవ్యాప్త పిలుపులో భాగంగా సోమవారం మంగళగిరిలోని తహసీల్దారు కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అదానీ కంపెనీ గ్రూపుల అవినీతిపై కేంద్ర ప్రభుత్వం సంయుక్త పార్లమెంట్ కమిటీ వేయాలన్నారు. మణిపూర్‌లో జరుగుతున్న అమానుష దాడులు, సంఘటనలపై పార్లమెంట్లో చర్చించాలని డిమాండ్ చేశారు. విద్యుత్తు చార్జీలను పెంచబోమని ఎన్నికలకు ముందు హామీ ఇచ్చి.. ఇప్పుడు ప్రజలను నిలువునా మోసగించారని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు కంచర్ల కాసియా, పి.నాగేశ్వరావు, జె.జాన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

సుస్థిరాభివృద్ధిపై శిక్షణ

ప్రజాశక్తి- దుగ్గిరాల

సుస్థిరాభివద్ధి లక్ష్యాలు అనే అంశంపై మండలంలోని అధికారులకు, ప్రజా ప్రతినిధులకు, గ్రామ వార్డు సచివాలయ సిబ్బందికి రెండు రోజుల శిక్షణ తరగతులు మంగళవారం నుంచి ప్రారంభించనున్నట్లు ఎంపీడీవో ఎ.శ్రీనివాసరావు తెలిపారు. 10, 11వ తేదీల్లో అధికారులు, సర్పంచులు, కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, మహిళా పోలీసులకు.. 16, 17వ తేదీల్లో వీఆర్వోలు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు, విద్యుత్ శాఖ వారికి.. 18, 19వ తేదీల్లో సర్వేయర్లు, వ్యవసాయ, ఉద్యానవన, పశుసంవర్ధక, మత్స్యశాఖ తదితర శాఖల సిబ్బందికి ఈ శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు మండల కేంద్రం దుగ్గిరాల ఎంపీడీవో కార్యాలయంలో తరగతులు ఉంటాయని.. సుస్థిరాభివద్ధికి చెందిన తొమ్మిది అంశాలపై అవగాహన కల్పించనున్నామని తెలిపారు.

సోనియాగాంధీ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి- మంగళగిరి

కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకురాలు సోనియాగాంధీ జన్మదినం సందర్భంగా సోమవారం మంగళగిరిలోని కార్యాలయంలో వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. మంగళగిరి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి షేక్ సలీం, కాంగ్రెస్ నాయకులు ఆర్.హనుమంతరావు, ఎం.శ్రీనివాస్ కుమార్, ఆర్.పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ఆరో రోజుకు ఏసీసీ కార్మికుల దీక్షలు

ప్రజాశక్తి-తాడేపల్లి

తమకు న్యాయంగా రావలసిన బకాయిల కోసం సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు చేస్తున్న దీక్షలు సోమవారం నాటికి ఆరో రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో కె.ఆదినారాయణ, ఎ.కోటేశ్వరరావు, షేక్ ఇస్మాయిల్, వై.నాగేశ్వరరావు కూర్చున్నారు. దీక్షలను కేజేకే మూర్తి ప్రారంభించారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు వేముల దుర్గారావు, ఐఎఫ్‌టియు నాయకులు కె.కోటేశ్వరరావు మాట్లాడుతూ మంత్రి నారా లోకేష్ ఇచ్చిన హామీ మేరకు కార్మికుల సమస్యను చర్చల ద్వారా పరిష్కరించాలని కోరారు. సిపిఎం పట్టణ కార్యదర్శివర్గ సభ్యులు కొట్టె కరుణాకరరావు మాట్లాడుతూ కార్మికుల పోరాటానికి పార్టీ పూర్తి అండదండలు ఇస్తుందని చెప్పారు. సిఎం స్థాయిలో సమస్యను పరిష్కరించాలని కోరారు. కోర్టులు కార్మికులకు అనుకూలంగా తీర్పు ఇచ్చినా అధికారులు అమలు చేయకపోవడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో ఆశీర్వాదం, బి.సూర్యప్రకాష్, వై.యహోశవ, ఇజ్రాయిల్, వై.సాంబయ్య, సుబ్బారావు, ఇమాంబి, శారద, రమాదేవి, సారమ్మ, నాగమల్లేశ్వరి, రమణ తదితరులు పాల్గొన్నారు.



దీక్షల్లో కూర్చొన్న కార్మికులు

సైబర్ నేరాలపై అప్రమత్తం

ప్రజాశక్తి - పెదనందిపాడు

సైబర్ నేరాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని పెదనందిపాడు ఎస్సై అద్దంకి మధు పవన్ సూచించారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో సోమవారం 8, 9, 10 తరగతి విద్యార్థులకు సైబర్ నేరాల పట్ల అవగాహన కల్పించారు. గుర్తు తెలియని వ్యక్తుల నుంచి ఎటువంటి సందేశాలు వచ్చినా.. ఇబ్బంది పెట్టినా ఇంట్లో పెద్దలను సంప్రదించాలని సూచించారు. సోషల్ మీడియాలో అమ్మాయిలు ఫొటోలు పెట్టవద్దని సూచించారు. సైబర్ నేరగాళ్లు ఫొటోలను మార్ఫింగ్ చేసే ప్రమాదం ఉందని తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని దుర్వినియోగం చేయరాదని, సోషల్ మీడియాలో వచ్చే లింకుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు ఎన్.లక్ష్మీ దుర్గ, ఉపాధ్యాయులు నూతి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఎస్సై మధు పవన్

పీజీఆర్ఎస్‌లో ఏడు వినతులు

ప్రజాశక్తి-తెనాలి రూరల్

ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమాన్ని స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో రెవెన్యూ పరమైన సమస్యలు 2, మున్సిపాలిటీకి సంబంధించి 1, డిఎల్పిఓ 1, హౌసింగ్ 1, ఎంపిడిఓ 1 మొత్తం ఏడు అర్జీలు స్వీకరించినట్లు తెనాలి సబ్ కలెక్టర్ వి.సంజన సింహ తెలిపారు. ఫిర్యాదుదారుల నుంచి స్వీకరించిన సమస్యలను అధికారుల సమన్వయంతో త్వరగా పరిష్కరిస్తామన్నారు.



ఫోట2 రైటప్: పిర్యాదులు స్వీకరిస్తున్న వి సంజన సింహ



స్కూలు బస్సులను తనిఖీ చేసిన ఆర్టీవో

ప్రజాశక్తి - పెదనందిపాడు

పెదనందిపాడు మండలంలోని స్కూలు బస్సులను సోమవారం ఆర్టీవో కె.మల్లీశ్వరి తనిఖీలు చేపట్టారు. ఒక ప్రైవేటు స్కూల్ బస్సుకు ఇన్సూరెన్స్ లేని కారణంగా రూ.2 వేలు పెనాల్టీ విధించారు. మరో రెండు ప్రైవేటు స్కూలు బస్సులకు ఓవర్ లోడ్ కింద రూ.1,200 చొప్పున జరిమానా విధించారు. స్కూల్ బస్సులలో అగ్నిమాపక నిరోధకాలు, అటెండర్, ఫస్ట్ ఎయిడ్ కిట్లు వంటి సౌకర్యాలు అందుబాటులో ఉంచాలని స్పష్టం చేశారు. ఈ తనిఖీల్లో కానిస్టేబుల్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పొలం ధ్వంసంపై విచారణ జరపాలి

ప్రజాశక్తి - తెనాలి రూరల్

తెనాలి మండలంలోని గుడివాడ డొంక మార్గంలో 100 ఏళ్లుగా సాగు చేస్తున్న పంట పొలాన్ని స్థానిక టిడిపి సర్పంచ్ అనుచరులు ఇటీవల ధ్వంసం చేశారని గుడివాడకు చెందిన రుద్రపాటి నాగేశ్వరరావు సబ్ కలెక్టర్ సంజన సింహకు సోమవారం అర్జీ సమర్పించారు. ఈ విషయంపై నాగేశ్వరరావు విలేకరులతో మాట్లాడుతూ సర్వే నంబరు 337కు సంబంధించి 40 సెంట్ల ప్రభుత్వ భూమిని తన తండ్రి వందేళ్లుగా సాగు చేశారని తెలిపారు. అప్పటి తహసీల్దార్ 72/74 ఆర్సి నంబరు ద్వారా కల్టివేషన్ పట్టా కూడా ఇచ్చారని చెప్పారు. అప్పటి నుంచి ప్రభుత్వానికి మినహా పొలంపై సర్వ హక్కులు తమవే కావడంతో పొలం సాగు చేస్తున్నామన్నారు. పంచాయతీ ఎన్నికల్లో స్థానిక టిడిపి నేతలకు సహకరించలేదన్న అక్కసుతో గుడివాడ సర్పంచ్ తన అనుచరులతో తమ పంట భూమిని క్రేన్ సహాయంతో 6అడుగుల మేరకు గుంతలు చేసి ధ్వంసం చేశారని ఆరోపించారు. దళితులపై, వారి ఆస్తులపై జరుగుతున్న అన్యాయాలను దళిత నాయకుడిగా తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు.

'చల్లపల్లి'కి సత్కారం

ప్రజాశక్తి మంగళగిరి

ఏపీ ఎంఎస్ఐడీసీ ఛైర్మన్ చల్లపల్లి శ్రీనివాసరావును సోమవారం ఆంధ్రప్రదేశ్ పద్మశాలి సంఘం రాష్ట్ర కో-కన్వీనర్ డాక్టర్ మునగపాటి వెంకటేశ్వరరావు, పద్మశాలి యువసేన ప్రతినిధుల ఆధ్వర్యంలో మంగళగిరి నియోజకవర్గం జనసేన కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ పద్మశాలి యువసేన ప్రతినిధులు గోపిశెట్టి రామాంజనేయులు రుషి, మునగపాటి రమేష్, పెనుగొండ శ్రీనివాసరావు, గోలి వంశీకష్ణ, మునగాల గిరిధర్, శీరపు దుర్గాప్రసాద్, కప్పాల లక్ష్మణ్, తెడ్లపు అప్పారావు, బొడ్డు శ్రీనివాస్, సింగానమల నారాయణ, చదుళ్ల రంగనాథ్ తదితరులు పాల్గొన్నారు.



చల్లపల్లి శ్రీనివాసరావుకు సత్కారం



ట్రాఫిక్‌కు విఘాతం కలిగిస్తే చర్యలు : సీఐ

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి గౌతమ బుద్ధ రోడ్, బస్టాండ్ ప్రాంతంలో ఆటోలు నిలుపు స్థలాలలో తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని ఆటోడ్రైవర్లకు సీఐ డి.వినోద్ కుమార్ సూచించారు. సోమవారం ఆటో డ్రైవర్లు, యూనియన్ నాయకులతో ఆయన సమావేశమయ్యారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూడాలని కోరారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అందరూ సహకరించాలని కోరారు.



విద్యార్థులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి- దుగ్గిరాల

ప్రారంభ దశలోనే వ్యాధిని గుర్తించినట్లయితే వైద్యం ద్వారా పూర్తిగా నయం చేయవచ్చునని స్థానిక పీహెచ్‌సీ వైద్యురాలు సి.ఇందిర అన్నారు. రాష్ట్రీయ బాల్య స్వస్తి (ఆర్‌బీఎస్‌కే) కార్యక్రమంలో భాగంగా సోమవారం స్థానిక బాలికల జిల్లా పరిషత్ హై స్కూల్లో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హై స్కూల్ స్థాయిలో బాలికలలో రుతుక్రమ సమస్యలు తెలుసుకుని, ప్రారంభంలో చికిత్స చేయడం ద్వారా ముమ్ముందు ఎటువంటి అనారోగ్య సమస్యలూ ఉత్పన్నం కాకుండా ఉంటాయన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది జి.శ్రీనివాస్, స్వరూపరాణి, విమల తదితరులు పాల్గొన్నారు.



శివాలయంలో అన్నదానం

ప్రజాశక్తి- మంగళగిరి

మంగళగిరి శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి దేవస్థానంలో శ్రీ కాశీ అన్నపూర్ణేశ్వరి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం భారీ అన్నసమారాధాన చేపట్టారు. ట్రస్ట్ ఛైర్మన్ పందేటి సాంబశివరావు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తుల సహకారంతో ప్రతి నెలలో అమావాస్య తర్వాత వచ్చే సోమవారం అన్న సమారాధన చేపడుతున్నట్లు వివరించారు. సుమారు 3 వేల మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు పుప్పాల కోటేశ్వరరావు, ట్రస్ట్ ప్రతినిధులు కర్నాటి శివ సత్యనారాయణ, కాగ్గా శ్రీనివాసరావు, నంగళం ప్రసాద్, పాపిరెడ్డి నాగరాజు, చిరుమామిళ్ల రంగారావు, నూతలపాటి వెంకటేశ్వరరావు, పెరుమాళ్లు సుబ్రహ్మణ్యం, గూండా రామాంజనేయులు, రెడ్డి వీర రాఘవులు, శివన్నారాయణ, శ్రీను పాల్గొన్నారు.

ద్వేషించే వారిని ప్రేమతో జయించాలి

ప్రజాశక్తి-తెనాలిరూరల్

ద్వేషించే వారిని ప్రేమతో.. శత్రువును స్నేహంతో గెలవాలని బెంగళూరు బానీ వ మొహ్తమిమ్ దారుల్ ఉలూమ్ జకరియ్యాకు చెందిన మౌలానా పీఎం ముజ్జమ్మిల్ సాహెబ్ అన్నారు. ఆదివారం చెంచుపేట ఈద్గా మైదానంలో పట్టణానికి చెందిన మజ్లీస్ ఉల్ ఉలమా సంస్థ ఆధ్వర్యంలో అజీముషాన్ జల్సా ఇస్లాహే ముఆషిరా పేరుతో జరిగిన ఇస్తేమా లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.



విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల సెక్రెటరీ, ఉపాధ్యాయులు

జాతీయస్థాయి కుంగ్‌ఫూ, కరాటే పోటీల్లో

సీతారామయ్య స్కూల్ విద్యార్థులకు బంగారు పతకాలు

ప్రజాశక్తి-గుంటూరు

చిలకలూరిపేటలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ మెమోరియల్ జాతీయస్థాయి కుంగ్‌ఫు, కరాటే చాంపియన్షిప్-2024లో పాటిబండ్ల సీతారామయ్య సిబిఎస్ఇ పాఠశాలలో మూడవ తరగతి చదువుతున్న ఆకిటి జన్వికభగత్ అండర్ 12 విభాగంలో గోల్డ్‌మెడల్, యుకెజి చదువుతున్న ఆకిటి విప్లవచంద్ర అండర్ 8 విభాగంలో గోల్డ్‌మెడల్ కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల సెక్రెటరీ అండ్ కరెస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ మాట్లాడుతూ చిన్నతనం నుండి విద్యార్థులు ఇటువంటి ఆత్మరక్షణ, మనోధైర్యాన్ని పెంపొందించుకోవడానికి దోహదపడే క్రీడలలో తర్ఫీదు పొందాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను, శిక్షణ ఇచ్చిన కోచ్ ఎం.కిరణను అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల పాలకవర్గ సభ్యులు గింజుపల్లి వరప్రసాదరావు, అకడమిక్ డైరెక్టర్ లేళ్ళ కష్ణవేణి, ప్రిన్సిపల్ జంపని పద్మజ, ప్రైమరీ ప్రిన్సిపల్ కర్లపూడి పార్వతీదేవి, కోఆర్డినేటర్లు దుర్గా శ్యామ్, శ్రీదేవి తదితరులు అభినందించారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సెక్రెటరీ, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

20, 23 తేదీల్లో కెఎల్‌పిలో క్విజ్‌బి, స్పెల్‌బి పోటీలు

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక జెకెసి కాలేజి రోడ్డులోని డాక్టర్ కెఎల్‌పి స్కూల్లో ఈనెల 20వ తేదీన రాష్ట్ర స్థాయి క్విజ్ పోటీలు, 23న జిల్లా స్థాయి స్పెల్‌బి పోటీలు నిర్వహిస్తున్నట్లు పాఠశాల సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ తెలిపారు. సోమవారం పాఠశాలలో పోటీలకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సెక్రెటరీ మాట్లాడుతూ 8-10వ తరగతి విద్యార్థులకు ఈ పోటీలకు అర్హులని, ఒక్కొక్క స్కూల్ నుండి ఒక టీమ్‌కు అనుమతి ఉంటుందన్నారు. క్విజ్‌బి విజేతలకు రూ.5వేలు, స్పెల్‌బి విజేతకు రూ.1000లు నగదు, ట్రోఫీ ప్రదానం చేయటం జరుగుతుందన్నారు. 20న ఉదయం 9 గంటలకు క్విజ్‌బీ పోటీలు ప్రారంభం అవుతాయన్నారు. ఇతర వివరాల కోసం 9948227362, 701301966 నంబర్లలో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జి.రత్తయ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జిఎంసి గ్రీవెన్స్‌కు 69 అర్జీలు

ప్రజాశక్తి-గుంటూరు



అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్

గుంటూరు నగరంలో స్థానిక సమస్యల పరిష్కారం కోసం నగరపాలక సంస్థలో చేపట్టే డయల్‌యువర్ కమిషనర్, గ్రీవెన్స్‌లో ప్రజలు ఇస్తున్న ఆర్జీలను సమగ్రంగా పరిశీలించి, శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. సోమవారం కమిషనర్ జిఎంసి ప్రధాన కార్యాలయంలో డయల్ యువర్ కమిషనర్, ఆ తర్వాత గ్రీవెన్స్ నిర్వహించారు. అర్జీలు నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలన్నారు. పారిశుధ్యం, త్రాగునీటి సరఫరా, రోడ్ల ఆక్రమణ వంటి సమస్యలపై జిఎంసి గ్రీవెన్స్‌కు వస్తున్నారని, వాటిని స్థానికంగానే పరిష్కరించాలని ఆదేశించారు. డయల్ యువర్ కమిషనర్‌కు 22 అర్జీలు, గ్రీవెన్స్‌లో ప్రజల నుండి నేరుగా 47 అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ సిహెచ్.ఓబులేసు, డిప్యూటీ కమిషనర్లు డి.శ్రీనివాసరావు, సిహెచ్.శ్రీనివాస్, సిఎంఓహెచ్ డాక్టర్ శోభారాణి, ఎంహెచ్ఓ డాక్టర్ రవిబాబు, సిటీప్లానర్ రాంబాబు, మేనేజర్ బాలాజీబాష తదితరులు పాల్గొన్నారు.

అర్జీలు సక్రమంగా పరిష్కరించకుంటే చర్యలు

గ్రీవెన్స్‌లో జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి

ప్రజాశక్తి-గుంటూరు



సుదూర ప్రాంతాల నుండి తమ సమస్యల పరిష్కారానికి గ్రీవెన్స్‌లో ప్రజలు అందించిన ఫిర్యాదులను నాణ్యతగా పరిష్కరించకుంటే సంబంధిత జిల్లా అధికారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి హెచ్చరించారు. సోమవారం కలక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి , సంయుక్త కలెక్టర్ ఏ.భార్గవ్‌తేజ, డిఆర్ఓ ఖాజావలి, డిప్యూటీ కలెక్టర్లు లక్ష్మి కుమారి, గంగరాజు , గుంటూరు ఆర్డిఓ కే.శ్రీనివాస రావు ప్రజల నుండి 172 ఫిర్యాదులను స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ అర్జీలను సక్రమంగా పరిష్కరించకుండా అసమగ్ర సమాచారంతో పిటిషనర్‌కు వివరాలు పంపి పిటీషన్ క్లోజ్ చేస్తే సంబంధిత క్షేత్ర సిబ్బందితో పాటు జిల్లా అధికారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. జిల్లా అధికారులు ప్రతి సోమవారం సమయపాలన పాటిస్తూ గ్రీవెన్స్‌కు హాజరు కావాలన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

వంద శాతం వైకల్యం ఉన్నా పింఛను రావట్లేదు...



పూర్తిగా వంద శాతం వైకల్యంతో మంచానికి పరిమితం అయిన తన కుమార్తె సయ్యద్ అస్మాకి రూ.15వేలు పెన్షన్ మంజురు చేయాలని కోరుతూ గుంటూరు, చుట్టుగుంట ప్రాంతానికి చెందిన కరీమా ఆమె కుమార్తెతోపాటు గ్రీవెన్స్ లో అర్జీ అందజేశారు. వంద శాతం వైకల్యం ఉన్నట్టు సదరం సర్టిఫికెట్, మెడికల్ బోర్డు సిర్టిఫికెట్ కూడా ఇచ్చాయన్నారు. సచివాలయంలో వేలి ముద్రలు పడట్లేదని, ఐరిష్ తీసుకోవటం కూడా సాధ్యం కావట్లేదని పెన్షన్ మంజూరు కాలేదన్నారు. భర్త చనిపోయాడని, పాపకు 20 ఏళ్లని, పాప వద్ద ఉండి అన్ని పనులు తానే చూసుకోవాలని, పనులకు వెళ్ళటం కూడా సాధ్యం కావట్లేదన్నారు. కావున పెన్షన్ మంజురు చేయాలని కోరారు.

నా ఆధార్‌తో లింక్ అయిన స్థలాలను తొలగించాలి...



నా ఆధార్ కార్డుతో 24 స్థలాలు లింక్ అవటం వల్ల ఇంటిస్థలం, పెన్షన్, ఇతర పథకాలు ఏమీ రావట్లేదని, లింక్ అయిన స్థలాలు తొలగించాలని కోరుతూ గుంటూరులో 106వ వార్డు సచివాలయం పరిధిలో నివసిస్తున్న షేక్. ముంతాజ్ కలెక్టర్ గ్రీవెన్స్‌లో అర్జీ అందజేశారు. తన భర్త చనిపోవటంతో వితంతు పెన్షన్‌కు దరఖాస్తూ చేసుకోవటానికి సచివాలయనికి వెళ్లగా 24 స్థలాలు లింక్ అయిన విషయం తెలిసిందన్నారు. తప్పును సరిచేయాలని సచివాలయ అధికారుల్ని కోరామని, పైనుంచి ఆదేశాలు రావాలని, అప్పటిదాకా ఏమి చేయలేమని చెబుతున్నారన్నారు. గతంలో ఇంటి స్థలం కోసం దరఖాస్తు చేసున్నా స్థలం రాక పోగా, మాకు తెలియకుండా పేరేచర్ల, పలకలూరు వేర్వేరు చోట్ల స్థలాలకు లింక్ అయినట్లు చూపించటం వల్ల ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఏవి రావట్లేదన్నారు. ఈ సమస్యపై గతంలో మున్సిపల్ గ్రీవెన్స్ కూడా అర్జీ ఇచ్చినా సమస్య పరిష్కారం కాలేదాన్నారు. దీని వల్ల పెన్షన్ కూడా రావట్లేదన్నారు. కావున తప్పును సరిచేసి తనకు ఇంటిస్థలం, పెన్షన్ మంజూరు చేయాలని కోరారు.

అంగన్‌వాడీ హెల్పర్ల ప్రమోషన్ ప్రక్రియ పూర్తి చేయాలి : సిఐటియు

జిల్లాలో పెండింగ్‌లో ఉన్న హెల్పర్ల ప్రమోషన్ ప్రక్రియ పూర్తి చేయాలని ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) నాయకులు గ్రీవెన్స్‌లో అర్జీ అందచేశారు. ఖాళీ అయిన అంగన్వాడి వర్కర్ల పోస్టలకు దరాఖాస్తు చేసుకున్న హెల్పర్లకు ఇంటర్యూలు పూర్తి అయినందున నియామక ప్రక్రియ పూర్తి చేయాలని యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు వై.నేతాజీ, జిల్లా అధ్యక్షులు ఏవిఎన్ కుమారి కోరారు. ఈ ఫైలుపై కలెక్టర్ అనుమతి మంజూరు చేస్తే హెల్పర్ల ప్రమోషన్లు ప్రక్రియ పూర్తి అవుతుందని, గత తొమ్మిది నెలలుగా ఈఫైలు జిల్లా కలెక్టర్ అనుమతి కోసం ఎదురుచూస్తుందన్నారు. ఈకాలంలో అనేకసార్లు ప్రాజెక్ట్ డైరెక్టర్‌ను, జిల్లా కలెక్టర్‌ను పలుమార్లు కలిసినా ఇంత వరకూ ఫైల్‌కు ఆమోదం లభించలేదన్నారు. దీనివల్ల జిల్లాలోని అనేక అంగన్వాడీ సెంటర్లలో వర్కర్లు, హెల్పర్లు ఇద్దరి పనిని ఎవరో ఒకరే చేయాల్సి వస్తున్నదని, పనిభారం పెరిగిందన్నారు. రాష్ట్రంలో అన్ని జిల్లాల్లోనూ ప్రమోషన్ల ప్రక్రియ పూర్తి చేస్తుండగా గుంటూరు జిల్లాలో మాత్రం పట్టిగంచుకోవట్లేదని, కావున కలెక్టర్ జోక్యం చేసుకొని హెల్పర్ల ప్రమోషన్ల ప్రక్రియ పూర్తి చేయాలని కోరారు.

డబ్బులు కట్టించుకుని మెషిన్ ఇవ్వట్లేదు...



కోల్డ్ ప్రెస్ ఆయిల్ మెషిన్ కొనుగోలు కోసం గుంటూరులోని పిఆర్ఎం ఏజెన్సీకి నగదు చెల్లించినా మెషిన్ ఇవ్వకుండా రెండేళ్లకుపైగా తిప్పించు కుంటున్నారని తెలంగాణ, వనపర్తి జిల్లాకు చెందిన దివ్యాంగుడు ఎస్. లక్ష్మన్న అర్జీ అందజేశారు. పొన్నూరు రోడ్డులోని సదరు ఏజెన్సీకి రూ. 1,41,600లు డీడీ చెల్లించానన్నారు. కానీ 26 నెలలుగా మెషిన్ ఇవ్వట్లేదని, అనేకసార్లు ఏజెన్సీ వద్దకి వెళ్లినా స్పందించట్లేదన్నారు. కనీసం డబ్బులు చెల్లించమని కోరుతున్నా ఇవ్వట్లేదన్నారు. కావున తనకు న్యాయం చేయాలని కోరారు.

సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని ధర్నా

ప్రజాశక్తి-గుంటూరు

భవన నిర్మాణ సంక్షేమ భోర్డును పునరుద్ధరించాలని కోరుతూ భవన నిర్మాణ, ఇతర నిర్మాణ కార్మికుల సంఘం (సిఐటియు) ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ యూనియన్ జిల్లాప్రధాన కార్యదర్శి దండాలక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా ఊరురా తిరుగుతూ ముఖ్యమంత్రి, ప్రజాగళం పేరుతో లోకేష్‌బాబు కార్మికులకు వాగ్దానాలు ఇచ్చినప్పటికీ అధికారంలోకి వచ్చే ఆరు నెలలు దాటిన ఇచ్చిన హామీలు అమలు కాకపోవటం బాధాకరమని అన్నారు. ఒక పైసా కూడా రాష్ట్రప్రభుత్వం బడ్జెట్ నుంచి నిధులు కేటాయించాల్సిన అవసరం లేకుండానే సంక్షేమ బోర్డును పనిచేయించవచ్చున్నారు. సంక్షేమ బోర్డులో ఉన్న నిధులను వెంటనే భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి ఉపయోగించాలని డిమాండ్ చేశారు. జిల్లాలో గత ఆరు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న 6,500 క్లెయిమ్‌లు తక్షణమే పరిష్కరించాలన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యంగా ఉండడంవల్ల కార్మికులు ప్రమాదాల గురై కుటుంబాలు గడవక అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఉచిత ఇసుక ఇంకా అందుబాటులోకి రాకపోవడం బాధాకరమన్నారు. రాజధాని నిర్మాణంలో స్థానికులకు ఉపాధి కల్పించాలని కోరారు. పక్క రాష్ట్రాల నుంచి వచ్చే కార్మికులకు వలస కార్మిక చట్టాన్ని అమలు చేయాలన్నారు. ధర్నాకు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సత్యనారాయణ అధ్యక్షత వహించగా, యూనియన్ జిల్లా నాయకులు కె.శ్రీనివాసరావు, గుంటూరు పశ్చిమ కమిటీ కార్యదర్శి ఎస్.కె.ఖాశీంవలి, తూర్పు కమిటీ కార్యదర్శి దీవెనరావు, శ్రీనివాసరావు, ఎస్.కె.భాష, డి.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు